

జగన్ విధ్వంసాన్ని అధిగమించి, సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అభివృద్ధి చేసి వచ్చే ఆదాయంతోనే సంక్షేమం కొనసాగాలి. అప్పు చేసి ఖర్చు చేయడం పరిపాలన కాదు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిగా సుదీర్ఘ సుపరిపాలన అందిస్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ

సోమవారం 01.12.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 224 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00







## అన్న క్యాంటీన్ల నాణ్యతపై

# నిరంతర నిఘా



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పేదవారి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల భోజనం రుచికరంగా, పరిశుభ్రమైనదిగా ఉండేలా ప్రభుత్వం కొత్త పద్ధతులు చేపట్టింది. కేవలం భోజనం అందించడం మాత్రమే కాదు, ఆహార నాణ్యతను ప్రతి పూటా తనిఖీ చేయడానికి ప్రత్యేక వ్యవస్థను రూపొందించింది. రాష్ట్రంలోని ప్రతి అన్న క్యాంటీన్‌ను పర్యవేక్షించడానికి ప్రత్యేక 'అడ్వైజరీ కమిటీ'లు ఏర్పాటవుతున్నాయి. ఈ కమిటీ సభ్యులు ఆహారం రుచి, నాణ్యతను తనిఖీ చేసిన తర్వాతే అది ప్రజలకు అందుతుంది.

**ప్రత్యేక కమిటీ నిర్మాణం :** ప్రతి అన్న క్యాంటీన్ వద్ద ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. కమిటీ ఛైర్మన్ స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్, కార్పొరేటర్ లేదా కౌన్సిలర్‌గా ఉంటారు. ఛైర్మన్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి స్వయంగా నియమిస్తారు. ఇతర సభ్యులుగా వార్డు శానిటేషన్ & ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి (ఉమెన్ పోలీస్), స్థానిక ఎన్జీవో ప్రతినిధి, డ్వాక్రా మహిళ, అన్న క్యాంటీన్ నోడల్ ఆఫీసర్ ఉంటారు.

**రుచి, నాణ్యతపై కట్టుదిట్టం :** కమిటీ సభ్యులు వంటల రుచి, నాణ్యతను స్వయంగా తనిఖీ చేయాలి. వంటగదిని పర్యవేక్షించి, నాణ్యమైన పదార్థాలు వాడుతున్నారా, వంటలు రుచికరంగా ఉన్నాయా అనే అంశాలను రికార్డులో నమోదు చేయాలి. ఆ తర్వాతే భోజనం ప్రజలకు అందుతుంది.

**నియమావళి మరియు నిరంతర పర్యవేక్షణ :** ప్రభుత్వం 7 ప్రధాన సూత్రాల పరిధిలో ప్రత్యేక నియమాలను రూపొందించింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రికార్డులను సమర్థవంతంగా నిర్వహించడం, రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించడం, స్థానిక ఎన్జీవోలు, వాలంటరీ గ్రూపులు, డ్వాక్రా సంఘాలతో సమన్వయం చేయడం ప్రధాన అంశాలు.

**ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం :** ప్రజల అభిప్రాయాన్ని అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. భోజనం నాణ్యత, క్యాంటీన్ ఏర్పాట్లపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే ప్రత్యేక విభాగం ద్వారా లోపాలను సరిదిద్దే చర్యలు చేపడతారు.

మిగతా 2లో...



## అమరావతిలో ప్రపంచస్థాయి అండర్‌గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యాధునిక అండర్‌గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం వేగంగా కొనసాగుతోందని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దశలవారీగా కీలక వసతుల నిర్మాణాన్ని చేపట్టిందని ఆయన పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుతో నగర భద్రతా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని లోకేష్ వివరించారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చడం వలన అవాంతరాలు తగ్గి, వ్యవస్థపై నమ్మకంతో పాటు నగర సౌందర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. 'ప్రపంచ స్థాయి అండర్‌గ్రౌండ్ పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇది అమరావతికి మరింత విశ్వసనీయత, భద్రత, అందాన్ని అందిస్తుంది. భవిష్యత్ తరాలకు నిలబడేలా రాజధానిని రూపుదిద్దుతున్నాం' అని లోకేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** "దిత్వా" తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులతో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం నాడు సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంత అధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా, రాయలసీమ విద్యుత్ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. అంతేగాకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు.

## డిసెంబర్ 4న తిరుమలలో పలు సేవలు రద్దు



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 4న సాలకట్ల కార్తిక పర్వదీపోత్సవం సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ, పౌర్ణమి గరుడసేవ రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. 4న కార్తిక పౌర్ణమి నాడు శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తరువాత దీపోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సాయంత్రం దీపాలను నేతి వత్తులతో వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తామన్నారు.

మిగతా 2లో...

### తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు

## అలెర్టుగా ఉండాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దిత్వా తుపాను ప్రభావం పడే జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నమయ్య, నెల్లూరు. కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలను అలెర్టు చేస్తూ ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మిగతా 2లో...

## 'హెచ్ఐవీ' నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమం

- 2015-16లో పరీక్షించిన వారిలో 2.34% పాజిటివిటీ
- 2024-25లో 0.58%కు తగ్గుదల
- 88.72 శాతంమేర మరణాల తగ్గుదల
- గర్భిణుల్లో 0.04%కు తగ్గిన సంక్రమణ
- ఒక్కొక్కరి చికిత్సకు ఏడాదికి రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయం
- 42వేల మందికి పింఛన్లు!
- సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా నిరంతరం అప్రమత్తం!
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** హెచ్ఐవీ కేసుల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన 80% లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (ఏపీ శాక్స్) 76.96% సాధించిందని తెలిపారు. అలాగే సాధారణ జనాభాలో పరీక్ష వచ్చిన వారిలో హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 2015-16లో 2.34% ఉండగా 2024-25 నాటికి అది 0.58%కు తగ్గిందని వెల్లడించారు.

మిగతా 2లో...

### రూ.385.57 కోట్లతో

## 4,018 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు !

- రాష్ట్రంలో ఈవీ మౌలిక సదుపాయాల విస్తరణకు పెద్దపీట

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో విద్యుత్ వాహనాలను విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో 4,018 విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ. 385.57 కోట్లతో ప్రాజెక్టు రూపొందించింది. ప్రధాన పట్టణాలు, జాతీయ రహదారులు, పారిశ్రామిక కేంద్రాలు, పోర్టులకు అనుసంధానంగా కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించబడ్డాయి.

**డిస్కంలు గుర్తించిన స్థలాలు :** విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం రాష్ట్రంలోని డిస్కంలు మొత్తం 1,002 లొకేషన్లను ఎంపిక చేశాయి. ఇందులో ఆగ్నేయ విద్యుత్ సంస్థ పరిధిలో 628, మధ్య విద్యుత్ సంస్థలో 165, దక్షిణ విద్యుత్ సంస్థలో 209 ప్రాంతాలు ఉన్నాయి. నెడ్‌క్యాప్



కేంద్రం-రాష్ట్ర సమన్వయ బాధ్యతలను నిర్వహిస్తుండగా, డిస్కంలు అమలు సంస్థలుగా వ్యవహరిస్తాయి.

**చార్జింగ్ కేంద్రాల నిర్వహణ విధానం :** చార్జింగ్ కేంద్రాలను చార్జ్ పాయింట్ ఆపరేటర్లు నిర్వహిస్తారు. వాహనదారుల నుంచి యూనిట్‌కు రూ. 15 చొప్పున వసూలు చేయబడుతుంది, అందులో కొంత భాగం డిస్కంలకు చెల్లించాలి. కేంద్రం సూచించిన ప్రమాణాల ప్రకారం 10 లక్షలకు పైగా జనాభా ఉన్న పట్టణాలు,

2లో...

### విశాఖ టూరిజంకు మరో ఆకర్షణ..

## దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన సిద్ధం

- డిసెంబరు 1 నుండి పర్యాటకులకు అందుబాటులోకి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర టూరిజం అభివృద్ధి వైపు కూటమి ప్రభుత్వం వేగం పెంచింది. సహజసిద్ధమైన పర్యాటక సౌందర్యాలను గుర్తించి, వాటిని ప్రపంచస్థాయిలో నిలువుదల చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది. సముద్ర తీరాలు, నదీతీరాలు, అటవీ ప్రాంతాలు, కొండలు, ఆలయాలు, చారిత్రక కట్టడాలుఏ రంగానికీ అతీతం కాకుండా పర్యాటక ఆస్తులను అభివృద్ధి చేస్తోంది. ఈ ధోరణిలోనే విశాఖపై మరింత వెలుగులు నింపే మరో ఆకర్షణ రూపు దాల్చింది.

**కైలాసగిరిపై ప్రతిష్టాత్మక గాజు వంతెన పూర్తిస్థాయిలో సిద్ధం :** పర్యాటకులకు థ్రిల్, కొత్త అనుభూతిని అందించేలా కైలాసగిరిపై నిర్మించిన గాజు వంతెన ఇప్పుడు ప్రజల సమక్షంలోకి రావడానికి సిద్ధమైంది. డిసెంబరు 1 నుంచి ఇది పర్యాటకులకు అందుబాటులో ఉంటుంది. 50 మీటర్ల పొడవుతో నిర్మించిన ఈ వంతెన, ప్రస్తుతం దేశంలో ఉన్న గాజు వంతెనల్లో అతి పెద్దదిగా గుర్తింపు పొందబోతోంది. 40 మిల్లీమీటర్ల మందం గల ల్యామినేటెడ్ గాజుతో, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన ఈ వంతెనకు గల కీలకమైన గాజును



జర్మనీ నుంచి ఆమదు చేశారు. 500 టన్నుల భారం మోయగలిగే సామర్థ్యం ఉన్నా, భద్రతా నియమాల మేరకు ఒక్కసారి 40 మందికే అనుమతిస్తారు. వంతెనపై నుంచి విశాఖ నగరం, సముద్రతీరాలు, పచ్చని కొండల అందాలను ఆస్వాదిస్తూ సందర్శకులు నూతన రొమాంచకతను అనుభవించవచ్చు.

**ప్రారంభానికి రెడీ :** ఈ ప్రతిష్ఠాత్మక వంతెనను ఎంపీ ఎం. శ్రీభరత్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నట్లు వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం. వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు. వీఎంఆర్‌డీఏ-ఆర్‌జే అడ్వెంచర్స్ సంయుక్తంగా రూ. 7 కోట్ల వ్యయంతో వంతెనను నిర్మించారు.

మిగతా 2లో...

### సినిమా, పర్యాటక రంగాల

## అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



- డిసెంబర్ 1,2 తేదీల్లో ముంబయిలో జరిగే 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025'లో పాల్గొననున్న మంత్రి
- ఫిల్మ్, టూరిజం రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై కీలకోపన్యాసం చేసి పెట్టుబడులను ఆహ్వానించనున్న మంత్రి దుర్గేష్

2లో

## 'దిత్వా'పై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం!

- "ప్రభావిత జిల్లాల్లో ప్రసవానికి దగ్గర్లో 7,871 మంది గర్భిణులు ఉన్నట్లు గుర్తింపు
- ఆసుపత్రులకు 375 మంది తరలింపు
- వైద్య శిబిరాల నిర్వహణకు కూడా సిద్ధం!
- ఉన్నతాధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దిత్వా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో ప్రసవానికి దగ్గర్లో ఉన్న గర్భిణుల విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. తుఫాన్ ప్రభావిత జిల్లాలైన అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, కోనసీమ, వెస్ట్ గోదావరి జిల్లాల్లో వచ్చే 15 రోజుల్లో ప్రసవానికి అవకాశం ఉన్న వారు 7,871 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిని ముందు జాగ్రత్తగా సమీపంలోని ఆసుపత్రులకు తరలించే ప్రక్రియ మొదలైంది. ఆదివారం రాత్రికి 375 మంది గర్భిణులు ఆసుపత్రులకు చేరుకున్నారని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఓ ప్రకటనలో తెలిపారు. మిగిలిన వారు కూడా ఆసుపత్రులకు రావాలని సూచిస్తున్నామని పేర్కొన్నారు. దిత్వా తుపాన్ ప్రభావిత పది జిల్లాల్లోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా



ఉండాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో విద్యుత్తు సరఫరాకు అవరోధం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఆసుపత్రులు సూపరింటెండెంట్లకు కమిషనర్ సూచించారు.

**వైద్య శిబిరాల నిర్వహణ :** దిత్వా తుఫాన్ ప్రభావానికి అనుగుణంగా వైద్య శిబిరాల నిర్వహణకు కూడా అధికారులు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కూడా 'దిత్వా' తుపాన్ సన్నాహక ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూములో ఇతర శాఖల వారితోపాటు వైద్య ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులు కూడా ఉంటున్నారు.

## అన్న క్యాంటీన్ల నాణ్యతపై నిరంతర నిఘా




(మొదటి పేజీ తరువాయి)

**సాంకేతిక పర్యవేక్షణ :** మానవ పర్యవేక్షణతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఉపయోగిస్తున్నారు. ప్రతి క్యాంటీన్‌లో సీసీటీవీ ద్వారా నిఘా, సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్ వ్యవస్థ, ఐటీ ఆధారిత గవర్నెన్స్ వంటి విధానాలతో పర్యవేక్షణ మరింత కచ్చితమైనదిగా ఉంటుంది.

మునిసిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా పురపాలక శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. తాజా నిర్ణయంతో అన్న క్యాంటీన్ల సేవలు మరింత మెరుగ్గా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## డిసెంబర్ 4న తిరుమలలో పలు సేవలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడాళ్వారు, వరదరాజస్వామి సన్నిధి, వకుళమాత, బంగారుబావి, కల్యాణ మండపం వద్ద దీపాల ఏర్పాటు ఉంటుందన్నారు. అదేవిధంగా సభ అర, తాళ్లపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగ నరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళం అర, వెండి వాకిలి, ధ్వజస్తంభం, బలి పీఠం వద్ద దీపాలను అర్చకులు వెలిగిస్తారన్నారు. క్షేత్ర పాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద కూడా దీపాల ఏర్పాటు ఉంటుందన్నారు.

## తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు అలెర్టుగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

సహాయం కోసం కంట్రోల్ రూమ్‌కు వచ్చే కాల్స్‌కు వెంటనే స్పందించాలని ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు, ఈదురుగాలులతో విరిగిపడే చెట్లు, కొమ్మలు, హోర్డింగ్స్‌ను వెంటనే తొలగించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

కాగా దిత్వా ప్రభావంతో ప్రకాశం, నెల్లూరు , బాపట్ల, కడప , అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు విపత్తుల శాఖ ఆరెంజ్ అలెర్ట్, కోనసీమ, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. దక్షిణకోస్తా పోర్టుల్లో మూడో నంబర్, ఉత్తరకోస్తా పోర్టులో రెండో నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. తుపాను ప్రభావం కారణంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించింది.

## రూ.385.57 కోట్లతో 4,018 ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు !



(మొదటి పేజీ తరువాయి)

స్మార్ట్ సిటీలుగా గుర్తింపు పొందిన నగరాలు, జాతీయ శుద్ధ గాలి పథకం కింద ఎంపికైన పట్టణాలకు ప్రాధాన్యం ఉంది. అర్హత కలిగిన సంస్థలు ఇతర ప్రాంతాల్లో కూడా కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

**జాతీయ రహదారుల వెంట కేంద్రాలు :** రాష్ట్ర, అంతర్రాష్ట్ర రహదారుల వెంట ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం అనుమతిస్తుంది. టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీ, పారిశ్రామిక ప్రాంతాలు, పెద్ద నగరాలకు అనుసంధానమైన హైవేలు ప్రధానంగా లక్ష్యంగా ఉంటాయి. డిస్కంలు ప్రతిపాదించిన కేంద్రాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలకు 2,371, కార్లకు 1,512, విద్యుత్ బస్సులు, ట్రక్లకు 135 కేంద్రాలను గుర్తించారు.

**కేంద్ర సబ్సిడీలు :** ప్రభుత్వ ఆవరణల్లో ఏర్పాటు చేసే కేంద్రాలకు శాతం వంద సబ్సిడీ, పరికరాలపై 100% రాయితీ లభిస్తుంది. సొంత భూమిలో ప్రభుత్వ లేదా ప్రజా రంగ సంస్థలు నిర్వహించే కేంద్రాలకు 80% మౌలిక సదుపాయాల సబ్సిడీ, 70% రాయితీ అందుతుంది. ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే కేంద్రాలకు 80% మౌలిక సదుపాయాల సబ్సిడీ వర్తిస్తుంది.

**ఛార్జింగ్ కనెక్టర్ సామర్థ్యాలు :** వాహనాల ప్రకారం ఛార్జింగ్ సామర్థ్యాలను స్పష్టంగా నిర్ణయించారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు 12 కిలోవాట్లు, కార్లు, బస్సులు, ట్రక్లకు డీసీ 50-250 కిలోవాట్లు, విద్యుత్ బస్సులు, ట్రక్లకు 250-500 కిలోవాట్ల హైపవర్ ఛార్జర్లు ఉండాలి. వేగవంతమైన ఛార్జింగ్ కోసం కనీసం 120 కిలోవాట్ల ఛార్జింగ్ గన్ తప్పనిసరి.

రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాల వినియోగం పెరగడంతో రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, ఇంధన ఆదా, వాహన వినియోగ సౌలభ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## విశాఖ టూరిజంకు మరో ఆకర్షణ.. దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన సిద్ధం



(మొదటి పేజీ తరువాయి)

కేరళలోని 40 మీటర్ల గాజు వంతెన ఇప్పటి వరకు దేశంలో అతి పెద్దదిగా ఉండగా, దీనితో ఆ రికార్డు చెరిగిపోతుందని ఆయన పేర్కొన్నారు.

రాత్రివేళల్లో త్రివర్ణ కాంతులతో మెరుస్తూ పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేశారు. సురక్షిత ప్రయాణం కోసం అనేక సార్లు తనిఖీలు చేసి, అవసరమైన మార్పులు చేసిన తర్వాతే ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రవేశ రుసుము త్వరలో నిర్ణయిస్తామని తెలిపారు.

**ఉపాధి, ఆదాయం రెండింటికీ కొత్త మార్గం :** జిప్‌లైనర్, స్కైసైక్లింగ్, రోప్‌వే, అద్దాల ఏసీ రైలుబండి వంటి విశాఖలో ఇప్పటికే ఉన్న ఆకర్షణలతోపాటు కొత్తగా గాజు వంతెన చేరడం వల్ల పర్యాటకుల రద్దీ పెరగడం ఖాయం. ఒడిశా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల నుంచి వచ్చే సందర్శకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది. దీంతో వీఎంఆర్‌డీఏ ఆదాయం పెరగడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి.

# 'హెచ్‌ఐవీ' నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమం

(మొదటి పేజీ తరువాయి)



కండోమ్ వంటి సురక్షిత విధానాలపై తీసుకొచ్చిన అవగాహన వంటి చర్యలవల్ల పాజిటివిటీ తగ్గుతూ వస్తుందని పేర్కొన్నారు. 2010లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలతో పోల్చితే 2024-25 నాటికి 88.72% తగ్గినట్లు న్యాకో ఇటీవల జారీచేసిన 2024-25 వార్షిక అంచనాల్లో పేర్కొందని సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భిణుల్లో హెచ్‌ఐవీ పాజివిటీ రేటు 2015-16లో 0.10% ఉండగా 2024-25 నాటికి 0.04%కు తగ్గిందని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినం (డిసెంబరు-1 ) పురస్కరించుకుని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదివారం ప్రకటన జారీచేశారు.

**24,957 నుంచి 13,3835కు తగ్గుదల :** 2015-16లో కొత్తగా 24,957 కేసులు, 2018-19లో 21,982 చొప్పున కేసులు వచ్చాయన్నారు. 2024-25లో కొత్త కేసులు 13,383 వచ్చినట్లు తెలిపారు. బాధితుల్లో అవగాహన కల్పించడం, ఉచితంగా మందులు ఇవ్వడం ద్వారా ఎయిడ్స్ సంబంధిత మరణాలను కూడా తగ్గించగలిగినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న హెచ్‌ఐవీ కేసుల్లో మహారాష్ట్ర (3,62,392) తరువాత ఏపీ (2,75,528)రెండో స్థానంలో ఉంది. అయితే కొత్త కేసులు పెరగకుండా నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం మంచి పురోగతిని సాధిస్తోంది. మరోవైపు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో 42,008 మంది ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారు. ఇంకొంతమంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసి, ఉన్నారు. ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

**యూఎన్ ఎయిడ్స్ లక్ష్యాల సాధనలోనూ...! :** ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాల (యూఎన్ ఎయిడ్స్ 95%-95%-95%) మేరకు బాధితుల గుర్తింపులో, గుర్తించిన వారికి మందులు ఇప్పించడంలో, వారి శరీరంలో వైరస్ తగ్గించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పురోగతి సాధిస్తోంది. జాతీయ స్థాయిలో 81% లక్ష్యం నమోదు కాగా ఏపీ శాక్స్ 86% సాధించింది. అలాగే... వైరల్ లోడు తగ్గించడంలో జాతీయ స్థాయిలో 97% లక్ష్యం నమోదుకాగా రాష్ట్రంలో 95% వరకు నెరవేర్చింది. బాధితులకు మందులు ఇప్పించడంలో జాతీయ స్థాయి లక్ష్యం 88% కాగా ఏపీలో 87% వరకు నమోదైనట్లు ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠారెడ్డి తెలిపారు.

**అన్ని కార్యక్రమాల్లో పురోగతి :** న్యాకో వెల్లడించిన 2024-25 స్కోర్కార్డులో ఏపీ ప్రభుత్వం రెండోస్థానంలో ఉంది. హెచ్‌ఐవీ నియంత్రణకు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాల్లో పురోగతి ఉన్నట్లు న్యాకో తెలిపిందని నీలకంఠరెడ్డి పేర్కొన్నారు.

**ఒక్కొక్కరిపై రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయం :** ఒక్కో హెచ్‌ఐవీ కలిగిన వ్యక్తిపై ఏడాదికి ప్రభుత్వం సగటున రూ. 35వేల నుంచి రూ. 40వేల వరకు వ్యయంచేస్తోంది. సెంట్రల్ సెక్టార్ స్కీము కింద న్యాకో ద్వారా ఉచితంగా యాంటీ రిట్రోవైరల్ థెరపీ మందులు వస్తున్నాయి. వైరల్ లోడు (శరీరంలో హెచ్‌ఐవి ఇన్ఫెక్షన్ సాయి గుర్తింపు) పరీక్షలు, ఇతర వాటికి కలిపి ప్రతి నెలా ఒక్కొక్క హెచ్‌ఐవీ పేషంటుకు నెలకు రూ. 3వేల నుంచి రూ. 3,500 వరకు వ్యయమవుతోంది. ప్రతినెలా ప్రస్తుతం 2,38,760 మంది మందులను రాష్ట్ర వ్యాప్తంగా 59 ఎఆర్టీ కేంద్రాల ద్వారా పొందుతున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడుతున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. 2004లో మొదటి కేసు గుంటూరు నగరంలో నమోదైంది. సదరు వ్యక్తి మందులు వాడుతూ ఇప్పటికీ మెరుగైన జీవనాన్ని సాగిస్తున్నారు.

**సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా..! :** హైరిస్కు బిహేవియర్ (మల్టీపుల్ పార్టనర్స్) ఉండి హెచ్‌ఐవీ పరీక్షల్లో నెగిటివ్ వస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తంచేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 13 'సంపూర్ణ సురక్ష కేంద్రాలు పైలటు ప్రాజెక్టు కింద 'న్యాకో' ద్వారా గత ఏడాది నుంచి నడుస్తున్నాయి. సుమారు 35వేల మందికి ఇప్పటి వరకు ఈ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్, హెచ్‌ఐవీ, ఇతర పరీక్షలు చేస్తున్నారు. హైరిస్క్ (సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ఇంజెక్టింగ్ డ్రగ్ యూజర్స్), ట్రాన్సజెండర్స్, మైగ్రంట్సు అండ్ ట్రక్కర్స్) గ్రూపులో ఉన్న వారికి ఏడాదిలో రెండుసార్లు హెచ్‌ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 109 ఎన్జీఓలు పనిచేస్తున్నాయి.

# మచిలీపట్నం, విశాఖలో మైరా బే వ్యూ రిసార్ట్స్

ANDHRA PRADESH TOURISM

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ప్రభుత్వం జారీ చేసిన నూతన పర్యాటక, భూ కేటాయింపుల పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలోని మచిలీపట్నం, విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు మైరా బే వ్యూ రిసార్ట్స్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో తమ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ఏపీ పర్యాటక శాఖకు పంపించింది. ఈ క్రమంలో సంబంధిత ప్రతిపాదనలు పరిశీలించిన పర్యాటక శాఖ నెల రోజుల అనంతరం ఆ సంస్థ ఐదుగురు భాగస్వామ్యుల నికర విలువ మార్చి 31,2025 నాటికి రూ. 166.05 కోట్లుగా గుర్తించింది. పాలసీ ప్రకారం ప్రాజెక్టు ఖర్చులో 25 శాతం ఉంటే ప్రతిపాదనలు అంగీకరిస్తారు. మైరా సంస్థకు సంబంధించి అంచనా వేసిన ప్రాజెక్టు ఖర్చులో 65 శాతం కంటే ఎక్కువ ఉండటంతో సంబంధిత సంస్థ నికర విలువ ప్రమాణంలో అర్హత పొందింది.

రూ. 255.91 కోట్ల అంచనా వ్యయంతో విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం మండలం కొత్తవలసలో 'మైరా బే వ్యూ రిసార్ట్స్ మరియు 3000 మంది సామర్థ్యం గల కన్వెన్షన్ సెంటర్'ను 15 ఎకరాల్లో నెలకొల్పేందుకు నిర్ణయించింది. ఇది పూర్తయితే భీమిలి నుండి భోగాపురం వరకు ఉన్న పర్యాటక కారిడార్ లో ఒక సమగ్ర హై ఎండ్ పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు గా నిలవనుంది. అంతేగాక లగ్జరీ విల్లా తరహా కాటేజీలు, టవర్ హోటల్ బ్లాక్ తో సహా 196 గదులను నిర్మించనుంది. అదే విధంగా ప్రీ -ఫంక్షన్ ప్రదేశాలు, బిజినెస్ మీటింగ్ రూమ్ లు, ఎగ్జిబిషన్ జోన్ లను ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయనుంది. 600 మంది సామర్థ్యం గల బ్యాంకెట్ హాల్,200 మంది సామర్థ్యం గల రెండు బహుళార్థసాధక బాల్‌రూమ్‌లతో పాటు రూఫ్‌టాప్ ఇన్ఫినిటీ పూల్, స్పాలు, వెల్ నెస్ థెరఫీ జోన్ లు, ఫైన్ డైనింగ్ రెస్టారెంట్ (400o మందికి), 20,000 చ.అ.ల రిటైల్/షాపింగ్ ప్రాంతం ఏర్పాటు చేయనుంది. తద్వారా 500 మందికి ప్రత్యక్షంగా మరో 500 మందికి పరోక్షంగా ఉపాధి కలగనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా 99 సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి లీజు ద్వారా వచ్చే ఆదాయం అంచనా రూ. 130.78 కోట్లు. 99 సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వాటా అంచనా రూ. 216.63 కోట్లు. ప్రస్తుతం ఉన్న భూమి విలువ ఎకరానికి రూ. 3.63 కోట్ల చొప్పున 15 ఎకరాలకు రూ. 54.45 కోట్లు విలువ చేస్తుంది.

దీనితో పాటు రూ. 157.53 కోట్ల అంచనా వ్యయంతో కృష్ణా జిల్లా మచిలీపట్నం మండలం తాళ్లపాలెం గ్రామంలో'లార్జ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ కమ్ రిసార్ట్' ను నిర్మించేందుకు 20 ఎకరాలు కేటాయించబడింది. తీర ప్రాంతంలో ఆతిథ్య, వినోద కేంద్రానికి కేరాఫ్ అడ్రస్ గా నిలవనున్న ఈ ప్రాజెక్టులో 30,000 చదరపు అడుగులలో అమ్యూజ్‌మెంట్ పార్క్, 25,000 చ.అ.లలో వాటర్ పార్క్ %ఱ% రైడ్‌లు, 150 గదులు, ఐదు రెస్టారెంట్లు మరియు బార్, 16,000 చ.అ.ల కన్వెన్షన్ సెంటర్, వెల్‌నెస్ స్పాలు, స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు కానున్నాయి. తద్వారా 380 మందికి ప్రత్యక్షంగా, 600 మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా 99 సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి లీజు ద్వారా వచ్చే ఆదాయం అంచనా రూ. 12.81 కోట్లు. 99 సంవత్సరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయ వాటా అంచనా రూ. 119.17 కోట్లు గా పర్యాటక శాఖ అంచనా వేసింది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం ఎకరా 26.67 లక్షలు కాగా 20 ఎకరాలకు దాదాపు రూ. 5.33 కోట్లు అవుతుంది. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా ప్రభుత్వానికి ప్రత్యక్ష,పరోక్ష పన్ను ఆదాయం, ప్రాంతీయ ఆర్థిక ప్రయోజనాలతో పాటు తీర ప్రాంత అభివృద్ధికి బీజం పడనుందని పర్యాటక శాఖ పేర్కొంది.

మెస్సర్స్ మైరా బేవ్యూ రిసార్ట్స్ అనేది ప్రపంచ స్థాయి రిసార్ట్‌లు మరియు ఇంటిగ్రేటెడ్ కన్వెన్షన్ సెంటర్‌ల అభివృద్ధి ద్వారా తీరప్రాంత పర్యాటక మౌలిక సదుపాయాలను పునర్నిర్వచించాలనే దార్శనికతతో ఉన్న భాగస్వామ్య సంస్థగా ఏపీ పర్యాటక శాఖ భావిస్తోంది. ప్రస్తుతం మైరా సంస్థ భాగస్వాములతో కలిపి మొత్తం 626 కీలు మరియు 3 కన్వెన్షన్ సౌకర్యాలతో కార్యకలాపాలు నిర్వహిస్తూ 6 ఆతిథ్య ప్రాజెక్టులలో అనుభవం కలిగి ఉంది. ఈ కంపెనీలలో మైరా బే వ్యూ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ల్యాండ్‌మార్క్ హోటల్ - రాయ్‌పూర్ CG, రోజ్‌బే రిసార్ట్స్ - రాయ్‌పూర్, మైరా రిసార్ట్ & కన్వెన్షన్ సెంటర్ - రాయ్‌పూర్, ఓమయా గార్డెన్ - రాయ్‌పూర్ (VIP రోడ్), ఓమయా సూట్స్ - రాయ్‌పూర్, లార్డ్ ఆఫ్ ది డ్రింక్స్ - రాయ్‌పూర్, మైరా సెరాయ్ ఎట్ కన్హానేషనల్ పార్క్, మధ్యప్రదేశ్ ఉన్నాయి.

# రేషన్ పంపిణీ వ్యవస్థలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం

- ఏపీలో రేషన్ కార్డు దారులకు భారీ ఊరట



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డు దారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా కొత్త ప్రణాళికల అమలుకు సిద్ధమైంది. ఇప్పటికే ప్రభుత్వం రేషన్ పంపిణీలో పలు రకాల మార్పులు తీసుకొచ్చింది. లబ్దిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తోంది. రేషన్ దుకాణాల వేళల్లో నూ మార్పులు చేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రేషన్ షాపులు అందుబాటులో ఉంచేలా డిసైడ్ అయింది. ఇదే సమయంలో రేషన్ లబ్దిదారుల కోసం ప్రభుత్వం తాజా నిర్ణయం ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు తుది కసరత్తు చేస్తుంది.

ఏపీ ప్రభుత్వం రేషన్ సరఫరా వ్యవస్థలో కొత్త మార్పులకు సిద్ధమైంది. ఇప్పటికే రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను తీసుకొచ్చారు. కాగా, ఇప్పటి వరకు నిర్దేశిత సమయాలకే పరిమితమైన రేషన్ సరఫరా ఇక రోజంతా అమలు చేసేందుకు సిద్ధమైంది. అదే సమయంలో చౌక ధర దుకాణాలను మినీమాల్స్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇందు కోసం తిరుపతి, గుంటూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, విజయవాడ నగరాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసారు. ప్రస్తుతం ఏపీలోని రేషన్ దుకాణాల్లో ప్రతి నెలా 1-15 వరకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు బియ్యంతో పాటుగా ఇతర నిత్యావసరాలు ఇస్తున్నారు. ఈ విధానంలో కొందరు డీలర్లు సరిగా దుకాణాలు నిర్వహించటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ తీసినా సమయపాలన పాటించకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో, వీటికి చెక్ పెడుతూ ప్రభుత్వం కొత్త నిర్ణయాల అమలుకు సిద్ధమైంది. మినీమాల్స్ విధానంలో రోజంతా దుకాణాలు తెరిచి ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. మినీమాల్స్‌లో అన్ని నిత్యావసరాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ వ్యవసాయ కో-ఆపరేటివ్ సొసైటీ, గిరిజన కార్పొరేషన్ నుంచి చౌకధర దుకాణాలకు ఆయా నిత్యావసరాలను సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే.. ఈ వస్తువులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా లేక డీలర్లే కొనుగోలు చేయాలా అనేది తెలియాల్సి ఉంది. అదే విధంగా సదరు నిత్యావసరాలపై లబ్ధిదారులకు రాయితీ ఉంటుందా లేదా అన్న అంశాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రేషన్ దుకాణాల్లో రేషన్ బియ్యంతో పాటు ఈ నిత్యావసరాలన్నీ పెట్టేందుకు అనువుగా ఒక్కో నగరంలో 15 చొప్పున మొత్తం 75 దుకాణాలను అధికారులు ఎంపిక చేస్తున్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చిన తరువాత అధికారికంగా ప్రకటించనున్నారు.

# సినిమా, పర్యాటక రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌ను సినిమా షూటింగ్‌లకు, పర్యాటకానికి ప్రధాన కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా "ది ఏఐ ఎరా – బ్రిడ్జింగ్ క్రియేటివిటీ అండ్ కామర్స్" థీమ్ తో డిసెంబర్ 1, 2 తేదీల్లో ముంబయి జుహూలోని జేడబ్ల్యూ మారియట్ హోటల్ లో జరగనున్న ప్రతిష్టాత్మక 'సీఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్ – 2025' లో పాల్గొనేందుకు ఆయన ఆదివారం రాజమహేంద్రవరం ఎయిర్ పోర్ట్ నుండి బయలుదేరారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)సభ్యులు, దేశ విదేశాలకు చెందిన మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగ ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు పాల్గొనే ఈ ప్రతిష్టాత్మక సమ్మిట్ లో ఏపీలో సినిమా పరిశ్రమను బలోపేతం చేయడానికి ప్రభుత్వం రూపొందిస్తున్న కొత్త 'ఫిల్మ్ టూరిజం పాలసీ' గురించి మంత్రి దుర్గేష్ వివరించనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు మరియు పోస్ట్-ప్రొడక్షన్ యూనిట్ల ఏర్పాటు ఆవశ్యకతను తెలిపి పెట్టుబడిదారులను ఆహ్వానించనున్నారు. అంతేగాక పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు,రాయితీలను వివరించి వారికి భరోసా కల్పించనున్నారు. సినిమాల ద్వారా పర్యాటక రంగాన్ని ఎలా అభివృద్ధి చేయవచ్చో మంత్రి దుర్గేష్ ప్రసంగించనున్నారు. ఏపీలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను వెండితెరపై చూపించడం ద్వారా రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తేవచ్చని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా భారతీయ మీడియా మరియు ఎంటర్టైన్మెంట్ రంగాన్ని %వి%100 బిలియన్ల స్థాయికి చేర్చడంలో ఏపీ తన వంతు సహకారం అందిస్తుందని, రాష్ట్రాన్ని సృజనాత్మక రంగానికి కేంద్రంగా మారుస్తూ 'ఆంధ్రా వ్యాలీ' గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడుగా కాకి ప్రకాష్ రావు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** నేటి ఉదయం మచిలీపట్నం లోని స్టార్ షైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యందు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశం యందు ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు గా పని చేయుచున్న ఎ జి ఎస్ గణపతి రావు గారు రాజీనామా చేయడం జరిగింది. గణపతి రావు గారు నవంబర్ 30 తేదీన పదవి విరమణ చేయటం జరిగింది. ప్రభుత్వం గుర్తింపు పొందిన సంఘము ల యందు పదవి విరమణ చేసిన వారు పని చేయరాదు అనే నియమం ప్రకారం గణపతి రావు గారు రాజీనామా చేయడం జరిగింది. ఆయన స్థానంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఉన్నటువంటి కర్నూలు జిల్లా కు చెందిన కాకి ప్రకాష్ రావు ను రాష్ట్ర అధ్యక్షుడు గా మరియు కృష్ణా జిల్లా కు చెందిన ఎం జి మహాడి ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్టం యందు పని చేసే ఎస్ జి టి ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల యందు ఓటు హక్కు కల్పించాలి, పి ఎస్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతి కేవలం సెకండరీ గ్రేడ్ టీచర్ లకు మాత్రమే ఇవ్వాలని, ఒకటి నుండి 10వం-కు తరగతులు జరుపుతున్న ఉన్నత పాఠశాల నుండి ప్రాథమిక పాఠశాల లను విడదీయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశం అనంతరం మాజీ అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు గారి దంపతులకు ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యవర్గ సమావేశం యందు రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహాడి , రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణ రావు, తెలంగాణ రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్ శర్మ, ఆప్టా రాష్ట్ర ఎన్నికల అధికారి రాజా సాగర్ మరియు అన్ని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈ సమావేశం యందు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపైన దృష్టి పెట్టాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్టు ఫైల్ ):** బి మఠం మండలం మల్లేపల్లి పంచాయతీ లింగల దిన్నే పల్లె లో శనివారం రైతన్న మీకోసం లో భాగంగా పకృతి వ్యవసాయ సిబ్బంది రైతులను సమావేశపరిచి పకృతి వ్యవసాయం గూర్చి తెలియజేసి వారికి ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని డెమో చేసి చూపించారు ఈ సమావేశానికి ప్రకృతి వ్యవసాయ పోరుమామిళ్ల డివిజన్ ఇంచార్జ్ ఎన్ ఎఫ్ ఏ నరసింహారెడ్డి ఎం టి వీరనారాయణ హాజరై వారు మాట్లాడుతూ బి మఠం మండలం లో చౌదరి వారి పల్లె రేకలకుంట్ల యూనిట్లలో రైతులు పకృతి వ్యవసాయం చేస్తున్నారని ఈ సంవత్సరం కొత్తగా నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్ లో భాగంగా మల్లెపల్లె ఆర్ ఎస్ కె పరిధిలోని గ్రామాలు సోమిరెడ్డి పల్లె ఆర్ఎస్ కె పరిధిలోని గ్రామాలు క్రొత్తగా వచ్చాయని కావున రైతులందరూ రసాయన పురుగుమందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం పైన దృష్టి పెట్టండని వారు రైతులకు మహిళ స్వయం సహాయక సభ్యులకు తెలియజేశారు రసాయన పురుగుమందులు తో పండించిన ఆహారం తినడం వల్ల మనుషులకు షుగర్ బీపీ క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు అధికంగా వస్తున్నాయని అలాగే భూమిలో కూడా సారవంతం తగ్గి పంటలు కూడా దిగుబడి తగ్గుతుందని ఇలా రైతులు నష్టపోకుడదన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):మండలంలోని కంచర్లపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదివారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని, రైతులు ఆలపాటికి తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ తేమ 25 శాతం వరకు ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అలాగే, ప్రభుత్వం పంటకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపడుతోందన్నారు. 17 శాతం తేమ ప్రమాణంతో రూ. 1780 కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేల మెట్రిక్ టన్నుల సేకరణలో భాగంగా, మొదటి దశలో వెయ్యి మెట్రిక్ టన్నుల కొనుగోలు చేసిందన్నారు.

రైతులకు ఉచితంగా టార్పాలిన్ షీట్లు అందిస్తున్నామని, మధ్యవర్తులను నమ్మి తక్కువ ధరలకు ధాన్యం అమ్ముకోవద్దని ఎమ్మెల్సీ సూచించారు. దళారుల వల్ల మోసపోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇవ్వాలని చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించిన ఆలపాటి, 63 లక్షల మందికి పెన్షన్ అందజేయడానికి ప్రభుత్వం సిద్ధమైందని, దేశంలో ఎక్కడా ఇలాంటి విస్తృత పెన్షన్ పథకం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మానిఫెస్టోలో ఉన్న హామీలను ఎలాంటి ఇబ్బందులు వచ్చినా పూర్తిగా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేస్తున్న ప్రజా కార్యక్రమాలను గ్రామాల్లో, ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత స్థానిక నాయకత్వంపై ఉందని ఎమ్మెల్సీ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, గ్రామంలోని పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సర్జికల్ బ్లేడును లోపలే ఉంచి శస్త్రచికిత్స చేసిన వైద్యుడి సస్పెండ్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): కాకినాడ జిల్లా తునిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓ యువకుడికి శస్త్రచికిత్స సమయంలో సర్జికల్ బ్లేడును లోపలే పెట్టి కుట్టేసిన ఘటనలో ఆర్థోపెడిక్ వైద్యుడుని , స్టాఫ్ నర్సును రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులు సస్పెండ్ ఉత్తర్వులు జారీచేశారు. ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్రచికిత్స ద్వారా స్టీలురాడ్డు వేయించుకోగా... నొప్పి ఎక్కువగా ఉందని రావడంతో ఏరియా ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు స్క్రూను నవంబరు 27న తొలగించారు. అయితే శస్త్రచికిత్స సమయంలో ఉపయోగించిన సర్జికల్ బ్లేడును అలాగే లోపలే ఉంచి, కుట్టువేశారు. యువకుడికి మళ్ళీ నొప్పి ఎక్కువైంది. ఎక్స్-రే ద్వారా బ్లేడ్ లోపల ఉన్నట్లు తేలింది. విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విచారణ జరిపి, నివేదించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబును ఆదేశించారు. ఈ మేరకు అయన విచారణ జరిపించారు. ఈ ఘటన పై అసుపత్రి సూపర్టెండెంట్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదు. డిస్ట్రిక్ట్ అధికారి ద్వారా విచారణలో సదరు ఆర్థోపెడిక్ వైద్యుడు , స్టాఫ్ నర్సు శస్త్రచికిత్స సమయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు తేలింది.

**అలక్ష్యాన్ని సహించను:మంత్రి**

ఈ నివేదిక అనుసరించి మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీచేసిన ఆదేశాల మేరకు డీ.ఎస్. హెచ్ చక్రధరబాబు సదరు ఆర్థో వైద్యుడు, స్టాఫ్ నర్సును సస్పెండ్ చేస్తూ ఆదివారం ఆదేశాలిచ్చారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించకుంటే కఠిన చర్యలు తప్పవని మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు.

## ప్రతీ గింజా కొంటాం..



గుడ్లవల్లేరు (జర్నలిస్ట్ ఫైల్): రైతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. తుఫాను సమయాన రైతన్నలు ఆందోళన చెందనవసరం లేదని.. ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయించే బాధ్యత తనదేని ఆయన స్పష్టం చేశారు. గుడ్లవల్లేరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. వాహనాల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్న ధాన్యపు రాశులను ఆయన పరిశీలించారు. మండలంలోని పెంజేంద్ర, డోకిపర్రు పరిసర గ్రామాల్లోని రైతులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. ఎమ్మెల్యే పర్యటనలో కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రైతులు సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైతన్నల సంక్షేమమే ఎజెండాగా గుడివాడ నియోజకవర్గంలో ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. తుఫాను సమీపిస్తున్న వేళ రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందిగా ఉన్న లారీలకు జియో ట్యాగింగ్ ను అధికారులు తొలగించారని, అంతేకాకుండా ఇతర జిల్లాలో ధాన్యం విక్రయించుకునే వెసులుబాటు కల్పించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

ఈ పర్యటనలో గుడ్లవల్లేరు టీడీపీ అధ్యక్షుడు కోసరాజు బాబాయ్ చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరు రవి, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు పోలవరపు వెంకటరావు, నిమ్మగడ్డ సత్యసాయి, వీరమాచనేని శివప్రసాద్, చింతపల్లి శివాజీ రెడ్డి, వీరమాచనేని నాగ జయరాం, సోమగాని బుజ్జి, మహబూబ్ బేగ్, కాగిత ఏడుకొండలు, పడమట కొండ, గానం వెంకటేశ్వరరావు, పెద్ది కోటయ్య, గోట్రు బంగారి, ఇద్రీస్ బేగ్, చిలకా నాగరాజు, బొప్పన శివప్రసాద్, గూడపాటి వెంకటేశ్వరరావు, పఠాన్ జహపురుల ఖాన్, సుభాని, షాజా, కరీం, పెనుమాక చిట్టిబాబు, రేమల్లి పెంటయ్య, గారపాటి నాగరాజు, జయప్రకాష్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చెయ్యాలి



ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):ఉంగుటూరు మండలం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, డిఐజి అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు లతో కలిసి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ఏర్పాట్లను పరిశీలించారు.

ఉంగుటూరు మండలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదివారం సాయత్రం ఉంగుటూరు మండలం గొల్లగూడెం హెలిప్యాడ్, నల్లమాడు ప్రజావేదిక మరియు కేదరు సమావేశ సభాస్థలి, గోపినాథపట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్ల లబ్ధిదారులు గృహాలను, తదితర ప్రాంతాలను ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, డిఐజి అశోక్ కుమార్, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపి అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ముఖ్యమంత్రి కార్యాలయ భద్రతాధికారులతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకేసారి పింఛన్లు పెంపుదల చారిత్రాత్మక నిర్ణయం అని, ప్రతినెల ఒకటవ తేదీన రాష్ట్రంలో ఒక గ్రామం ఇంటింటికి వెళ్ళి పింఛన్లు పంపిణీ చెయ్యడం చంద్రబాబుకే సాధ్యం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని అన్నారు. గత ప్రభుత్వం వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పట్టిందని, పనిచేసే ప్రభుత్వానికి, పనిచెయ్యని ప్రభుత్వానికి తేడాను ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఏ ఆదరణ లేక నిరాధారణకు గురైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పట్ల కూటమి ప్రభుత్వానికి మానవత్వం ఉందన్నారు. గత ప్రభుత్వం హంగుఆర్భాటాలు, రంగులు మీద పెట్టిన శ్రద్ధ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులపై పెట్టలేదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుపేదలు ఇంటికి స్వయంగా వెళ్ళి పింఛన్లు సొమ్మును అందించి, వారి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుంటున్నారని అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఈ విధంగా చేయలేదని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకపోయినా కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని వర్గాలు ప్రజలకు మేలు చెయ్యాలనే ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమ దిశగా రాష్ట్రానికి మంచి ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. రైతుకు ఒక్కసారి కోకో,పొగాకు, మొక్కజొన్న పంటలు సమస్యలు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి అన్ని విధాలుగా తోడుగా ఉందని అన్నారు. ప్రతి రైతుకు టర్పాలిన్లు అందించడం వలన పంట నష్టాలను కొంత మేర తగ్గించ గలిగామని అన్నారు. ఆరుగాలం శ్రమించిన పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించి, 24 గంటల్లో డబ్బులను నేరుగా వారి వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని అన్నారు. దేశంలోనే మన రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు.

జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉంగుటూరు మండలం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. . గోపినాథపట్నం యన్టీఆర్ బరోసా సామాజిక పింఛన్లు లబ్ధిదారులు గృహాలకు ముఖ్యమంత్రి స్వయంగా వెళ్ళి పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని సిద్ధం చేశామని అన్నారు. పర్యటన పూర్తి అయ్యేంతవరకు వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించామని, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో నిమగ్నమై ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం అయ్యేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అత్యధిక పింఛను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని, ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఇంటింటికి వెళ్ళి పింఛన్లు అందజేయటం ఏ ముఖ్యమంత్రి చెయ్యలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మా నియోజకవర్గంలో రూ 130 కోట్లు అభివృద్ధి పనులు చేసుకున్నామని, ఆర్వోబి పనులు రూ 450 కోట్లు పూర్తి చేస్తామని అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా నియోజక వర్గంలో కాలువలు, బ్రిడ్జి నిర్మాణాలు, తదితర పనులు చేసుకున్నామన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

ఏపీ అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి జిల్లా మౌలిక సదుపాయాలు, ఆక్వా రైతులు, కొల్లేరు సమస్యలను దృష్టికి తీసుకొస్తామన్నారు. కూటమి ప్రభుత్వం మూడు పార్టీ నాయకులు కలిసికట్టుగా సంక్షేమం, అభివృద్ధి కృషి చేస్తున్నామని అన్నారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ, ముఖ్యమంత్రి కార్యాలయ భద్రతా అధికారులు, ఏఎస్పీలు నక్కా పూర్ణ చంద్రరావు, ఆర్.సుస్మిత, మాజీ శాసనసభ్యులు ఘంటా మురళీ రామకృష్ణ, ఏలూరు ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, డిఎస్పీ లు, జిల్లా, మండల వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో'



గుడివాడ (జర్నలిస్ట్ ఫైల్): డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దాలనే కూటమి ప్రభుత్వ లక్ష్య సాధనకు అనుగుణంగా ఈగల్ సెల్ నిర్విరామంగా పని చేస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో "డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో" కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో "డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో" నినాదంతో 'గుడివాడ సైక్లోథాన్-2025' సైకిల్ ర్యాలీ ఆదివారం సందడి వాతావరణంలో జరిగింది. ఈ ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు, యువతతో కలిసి ఈగల్ టీం ఐజీ ఆర్కే రవికృష్ణ, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దంపతులు, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పలు అధికార ప్రముఖులు సైకిల్ తొక్కుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

**మంచి అలవాట్లతోనే ఉన్నతస్థాయి :** అదే విధంగా తొలుత జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఈగల్ టీం ఐజీ రవి కృష్ణ మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నామని ఆయన తెలియజేశారు. తాము పట్టుకున్న అనేక కేసుల్లో చెడు స్నేహాలతో డ్రగ్స్ బారిన పడి ఎందరో అమాయకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు, చెడు అలవాట్లు ఈ రెండింటికి మధ్య వ్యత్యాసాన్ని చిన్నతనం నుంచి గుర్తించాలని ఐజీ రవి కృష్ణ ఈ సందర్భంగా అందరికీ సూచించారు. మంచి అలవాట్లతో మనం ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునీ, చెడు అలవాట్లతో పతనమైపోతామని ఐజీ రవి కృష్ణ పేర్కొన్నారు. అమ్మానాన్నల కలలను నిజం చేసేలా ప్రతి ఒక్కరూ మంచివైపు నడవాలని ఐజీ యువతకు పిలుపునిచ్చారు.

**డ్రగ్స్ అమ్మాలంటే భయపడే రోజులు వచ్చాయి :** డ్రగ్స్ వద్దు బ్రో అనేది మనందరి నినాదం కావాలని ఐజీ రవికృష్ణ వివరించారు. ఏపీలో డ్రగ్స్ అమ్మాలంటే భయపడే రోజులు వచ్చాయనీ, డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో అందరం భాగస్వామ్యం అవుదామని సూచించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వ టోల్ ఫ్రీ 1972 నంబర్?కు సమాచారం అందించాలని ఎమ్మెల్యే రాము సైతం ఈ సందర్భంగా అందరికీ విజ్ఞప్తి చేశారు. ఏపీలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపడుతున్నారని తెలియజేశారు.

అదే విధంగా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ, ఓ మంచి కార్యక్రమానికి ఇన్ని వేలమంది చిన్నారులు రావడం ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడంలో తాము చేస్తున్న కృషికిగాను నేడు చిన్నారులు ఇస్తున్న ప్రోత్సాహం చూస్తుంటే తాము రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ముందుగా Free Society-SayNotoDrugs ప్రచార ప్లకార్డులను ఐజీ రవి కృష్ణ, ఎమ్మెల్యే రాము ఇతర ప్రముఖులు ఆవిష్కరించగా ఎమ్మెల్యే రాము దంపతులు పావురాలను వదిలి ర్యాలీను లాంఛనంగా ప్రారంభించారు.

**ర్యాలీ జరిగే రూట్లలో ట్రాఫిక్ మళ్లింపు :** అనంతరం ఐజీ రవి కృష్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, ఎమ్మెల్యే రాము స్టేడియం పతాకాన్ని ఎగరవేశారు. స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు జెండా ఊపి సైకిల్ ర్యాలీలను ప్రారంభించారు. పెద్ద ఎత్తున ర్యాలీ సీనియర్, జూనియర్ విభాగాల్లో జరుగుతున్న దృష్ట్యా గుడివాడ పట్టడంతో పాటుగా ర్యాలీ జరిగే రూట్లలో ట్రాఫిక్ మళ్లిస్తూ పోలీసులు ప్రత్యేక చర్యలను చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు స్టేడియం కమిటీ తరపున సర్టిఫికెట్స్, బహుమతులను పంపిణీ చేశారు.

**సైకిల్ ర్యాలీలో పాల్గొన్నవారు :** ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, బూరగడ్డ శ్రీకాంత్, ధావులూరి సురేంద్రబాబు, ఈగల్ టీం ఐపీఎస్ మహేశ్వర రాజు, మచిలీపట్నం డీఎస్పీ రాజా, ఐఎంఏ పెద్దలు డాక్టర్ పొట్లూరి వంశీ, గుడివాడ జనసేన ఇన్?ఛార్జ్? బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహన్?రావు, లింగం ప్రసాద్, టీం వెనిగండ్ల సభ్యులు, పలు స్వచ్ఛంద, సామాజిక సంస్థల పెద్దలు, ఐఎంఏ వైద్యులు, సైకిల్ క్లబ్ సభ్యులు, వేలాదిగా విద్యార్థినీ విద్యార్థులు యువత కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 15 ఏళ్ల తర్వాత ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌కు ఎట్టకేలకు ఎన్నికలు జరగబోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్ష మంది ఫార్మసిస్టులు ఈ ఎన్నికల కోసం 15 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. కోర్టు కేసులు, కొంత మంది చేసిన రాజకీయాల కారణంగా రాష్ట్ర విభజన తర్వాతి నుంచి ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వం అండతో కొంత మంది తమ స్వార్థం కోసం ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలకు అడ్డుపడుతూ వచ్చారు. ప్రభుత్వ ఫార్మసిస్టు అసోసియేషన్, మరికొన్ని అసోసియేషన్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే ఎన్నికల్లో 60 వేల మంది ఫార్మసిస్టులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. డిసెంబరు 4వ తేదీ నుంచి ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ పత్రాలు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిస్తారు. ఓటర్లు తమ నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి డిసెంబరు 24వ తేదీ నాటికి తిరిగి ఎన్నికల నిర్వహణ కమిటీకి పంపించాల్సి ఉంటుం ది. డిసెంబరు 26 లేదా 27వ తేదీన వాటిని లెక్కించి, అత్యధిక ఓట్లు సాధించిన ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకుంటారు. మొత్తం 15 మంది సభ్యులకుగాను, మరో ఐదుగురిని ప్రభు త్వం నామినేట్ చేస్తుంది. వీరు కాకుండా డీఎంఈ, డీహెచ్, ప్రభుత్వ అనలిస్ట్‌తో పాటు డ్రగ్స్ డీజీలు ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా ఉంటారు. ఈ 15 మంది కలిపి ఫార్మసీ కౌన్సిల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు.

ఇప్పటి వరకూ కౌన్సిల్ రిజిస్ట్రర్ ద్వారానే ఫార్మసీ కౌన్సిల్ నిర్వహిస్తూ వచ్చారు. దీనివల్లే అనేక అవకతవకలు జరుగుతూ వచ్చాయి. కొత్త కౌన్సిల్ ఏర్పడితే ఫార్మసీ కౌన్సిల్‌లో అడ్మినిస్ట్రేషన్ చక్కబడుతుందని ఫార్మసిస్టులు భావిస్తు న్నా రు. ఎన్నికల కోసం పోరాటం చేసి రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ ప్యానెల్ కొంత మందిని ఎంపిక చేసి ఎన్నికల్లో బరిలోకి దించింది. వీరిలో కోల శ్రావణ్‌కుమా ర్, కోటిపాటి రాధాకృష్ణ, నాగకృష్ణరాజు, నల్లమిల్లి ఆదిరెడ్డి, లుక్కా నరేష్, ప్రభుత్వ ఫార్మసిస్టుల తరపున వేమూరి మాలతి ఎన్నికల బరిలో దిగారు.

### కొన్ని బస్సుల్లో చార్జీలు తగ్గింపుకు

# ఏపీఎస్ ఆర్టీసీ కసరత్తు..!

- డిసెంబర్ 1 నుంచి అమలయ్యే అవకాశం
- కొన్ని రూట్లలో ప్రతిపాదనలు




ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్): ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలను అందించడానికి ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తోన్నారు. వివిధ నగరాలు, జిల్లా కేంద్రాలకు అత్యాధునిక బస్సులను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. రద్దీ మార్గాల్లో వాటిని ప్రవేశపెడుతున్నారు. వాటికి ప్రయాణికుల నుంచి అపూర్వ స్పందన లభించిన నేపథ్యంలో మరన్ని కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తోన్నారు. ఏసీ వెన్నెల స్లీపర్, నైట్ రైడర్, డాల్ఫిన్ క్రూయిజ్ పేరుతో ఏసీ సీటింగ్ కమ్ స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టారు. సీటింగ్ ప్లస్ స్లీపర్ కోచ్ ఇది.

విశాఖపట్నం నుంచి హైదరాబాద్ మధ్య ఈ బస్సులు పరుగులు పెడుతోన్నాయి. వాటికి కూడా అంచనాలకు మించి ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తోంది. వారాంతపు, సెలవు రోజుల్లో సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులను మరింత ఆకట్టుకునేలా తాజాగా బస్ ఛార్జీలను తగ్గించారు. ఇంద్ర, అమరావతి ఏసీ బస్సులో మాత్రమే ఈ 10 శాతం వరకు ఛార్జీ తగ్గుతుంది

ఈ రాయితీ డిసెంబర్ 1వ తేదీన అమలులోకి వస్తుంది. 20వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే ఆదివారం నాడు ఈ డిస్కౌంట్ అందుబాటులో ఉండదు.

గుంటూరు నుంచి మిర్యాలగూడ మీదుగా బీహెచ్‌ఈఎల్ వెళ్లే అన్ని అమరావతి బస్ సర్వీసుల్లో 10 శాతం వరకు అంటే ప్రస్తుతం ఉన్న ఛార్జీ 870 నుంచి 790 రూపాయలకు తగ్గుతుంది.

గుంటూరు నుంచి విజయవాడ మీదుగా బీహెచ్‌ఈఎల్ వెళ్లే అన్ని అమరావతి బస్ సర్వీసుల్లో ఛార్జీలు ప్రస్తుతం ఉన్న 970 నుంచి 880 రూపాయలకు తగ్గుతుంది.

గుంటూరు నుంచి మిర్యాలగూడ మీదుగా బీహెచ్‌ఈఎల్ వెళ్లే అన్ని ఇంద్ర బస్ సర్వీసుల్లో ఛార్జీ 700 నుంచి 640 రూపాయలకు తగ్గుతుంది.

తెనాలి నుంచి బీహెచ్ ఈఎల్ వెళ్లే అన్ని ఇంద్ర బస్ సర్వీసుల్లో ఛార్జీ 770 నుంచి 710 రూపాయలకు తగ్గుతుంది.

తెనాలి నుంచి విశాఖపట్నం వెళ్లే అన్ని ఇంద్ర బస్ సర్వీసుల్లో ఛార్జీ 960 నుంచి 880 రూపాయలకు తగ్గుతుంది.

# ఏపీ హక్కుల కోసం పోరాడండి..



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఏపీలో రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభంతో పాటు ఏపీ హక్కులు సాధన కోసం పార్లమెంట్‌లో పోరాడాలని వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ ఎంపీలకు సూచించారు. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు కానున్న విషయం తెలిసిందే.

సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. తుపాను నష్టంతో పాటు పంటలకు కనీస మద్దతు ధర లభించకపోవడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ అంశాలపైనే ప్రధానంగా దృష్టి సారించాలని చెప్పారు. మొంథా తుపాను కారణంగా కోస్తా జిల్లాల్లో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని.. సర్వం కోల్పోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయన్నారు.

గతంలో తమ ప్రభుత్వం ఆర్‌కేబీల ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని.. ప్రస్తుతం ఆ వ్యవస్థను నిర్వీర్యం చేయడంలో రైతులు దళారుల చేతుల్లో నలిగిపోతున్నారన్నారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, కంది, అరటి, మిర్చి, మామిడి తదితర ప్రధాన పంటలకు మద్దతు ధర పడిపోయిందని.. దాంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసిన జగన్ ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రీమియం భారం లేకుండా ఉచిత పంటల బీమా అందించామని.. ఇప్పుడు ఆ పథకాన్ని నిలిపివేయడంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందడం లేదని, ఈ-క్రాప్ నమోదును నిలిపివేయడంతో పరిహారం పొందేందుకు రైతులు అనర్హులుగా మారుతున్నారన్నారు. మిర్చి రైతులకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పి మోసం చేశారని, మామిడి రైతులను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 18.63 లక్షలతో సహా మొత్తం లక్షల ఉపాధిహామీ జాబ్ కార్డులను రద్దు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో కుటుంబాలు జీవనోపాధిని కోల్పోతున్నాయని.. అర్హుల కార్డులను పునరుద్ధరించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేయాలని ఎంపీలకు చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజకీయ కక్ష్య సాధింపులు పెరిగాయని, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయని.. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఉపాధి కల్పన, హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు.

## ఉచిత యూపీఎస్సి సివిల్స్ కోచింగ్ కి ముగిసిన ప్రవేశ పరీక్ష

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): యూపీఎస్సీ సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డా. బి.ఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణ కోసం మొత్తం 6, 361మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులకు విశాఖ, విజయవాడ, తిరుపతి అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో 4 నెలల పాటు అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో యూపీఎస్సీ ప్రిలిమ్స్ కి శిక్షణ అందించనున్నారు.



## యల్.బి ఆర్.సి ఇ లో జె.యన్.టి.యు.కె సెంట్రల్ జోన్ వాలీ బాల్ టోర్నమెంట్ పోటీలు

**మైలవరం, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని యల్.బి ఆర్.సి.ఇ హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి తెలిపారు. 29 ,30 వరకు యల్.బి.ఆర్.సి.ఇ లో జె.యన్.టి.యు కాకినాడ సెంట్రల్ జోన్ వాలీ బాల్ ఇంటర్ కాలిజియేట్ పోటిలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలను హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి , చారిటబుల్ ట్రస్టీ డా .లకిరెడ్డి హనిమిరెడ్డి , డా.జి. పి.రాజు , సెక్రటరీ, జేఎన్టీయూకే ఐ సి టీ, కళాశాల ప్రెసిడెంట్ .జి. శ్రీనివాస రెడ్డి మరియు ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ముఖ్య అతిథులు గా పాల్గొన్నారు. . .ఈ సందర్భంగా లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి తమ కళాశాల లో విద్యార్థులు చదువులో, క్రీడలలో ముందుంటారని కళాశాల లో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు మరియు జె.యన్.టి.యు కాకినాడ సెంట్రల్ జోన్ వాలీ బాల్ టోర్నమెంట్ లో ఆయా జిల్లాలకు చెందిన 44 ఇంజనీరింగ్ కళాశాలల వాలీ బాల్ టీమ్ లు పాల్గొంటున్నాయిని తెలిపారు. డా జి .పి రాజు మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని అలాగే క్రీడల ద్వారా ఆరోగ్యంగా ఉంటారని విద్యార్థిని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని క్రీడల ద్వారా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని తెలిపారు. అనంతరం 44 ఇంజనీరింగ్ కళాశాలల వాలీ బాల్ టీమ్ ల నుండి యూనివర్సిటీ ప్లేయర్స్ ను ఎంపిక చేయనున్నారు. ఈ టీమ్ జె.యన్ .టి.యు.కె, కాకినాడ లో డిసెంబర్ 10 వ తేదీ నుండి జరిగబోయే సౌత్ జోన్ అల్ ఇండియా టోర్నమెంట్ లో పాల్గొంటారు ఈ టోర్నమెంట్ ప్రారంబోత్సవంలో వైస్ ప్రిన్సిపాల్ డా.కె.రమేష్ రెడ్డి, సెలక్షన్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్, .ఎల్.కృష్ణా రెడ్డి , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు ఇతర సిబ్బ ంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా యల్.బి. ఆర్.సి.ఇ ఫిజికల్ డైరెక్టర్ డా.యన్.వి.రాజ్ కుమార్ వ్యవహరించారు.

### ఫుట్ బాల్ మ్యాచ్
## ప్రారంభించిన లంక లితీష్



**మైలవరం, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి డి ఎ ఫుట్బాల్ లీగ్ పోటీలు దీ 24-నుండి ఎన్టీఆర్ జిల్లా మైలవరం లక్కి రెడ్డి బాలి రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ప్రారంభించిగా 29 న జరిగిన కోరమండల్ వర్సెస్ కొల్లేరు మ్యాచ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా శేషగిరిరావు, మ్యాచ్ చైర్మన్ చక్రవర్తి, లయన్ జాస్తి వెంకటేశ్వరరావు లు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి దూరు. బాలకృష్ణ,సొసైటీ బ్యాంక్ చైర్మన్ కర్రెడ్ల వెంకట నారాయణ, మహిళా అధ్యక్షురాలు పసుపులేటి రేణుక, టౌన్ పార్టీ సెక్రటరీ వేముల అంకరాజు,మైనార్టీ నాయకులు షేక్ బాజీ, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మైక్ బాబురావు, నూతక్కి.సతీష్, పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యన్ని కాపాడేది కాంగ్రెస్స్ పార్టీయే

- ఎఐసిసి పరిశీలకులు,రాజ్యసభ ఎంపి నీరజ్ డాంగి




**ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

బిజెపి కేంద్ర ప్రభుత్వ కబంధ హస్తాల నుండి ఈ దేశాన్ని,ప్రజాస్వామ్యన్ని కాపాడేది కాంగ్రెస్స్ పార్టీ యేనని ఎఐసిసి పరిశీలకులు,రాజ్యసభ ఎంపి నీరజ్ డాంగి అన్నారు. ఎంపి నీరజ్ డాంగి మాట్లాడుతూ దేశ సమగ్రతను, ప్రజాస్వామ్య వ్యవస్థను బిజెపి కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు.

శనివారం కొండపల్లి లో ఈ కార్యక్రమము ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు బొర్రా కిరణ్ ,ఆధ్వర్యంలో సంఘటన శ్రీజాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ ఆదేశానుసారం ఎన్టీటఆర్ జిల్లాలో జరుగు సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా రాజస్థాన్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు నీరజ్ డాంగి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే పీసీసీ పరిశీలకులుగా కొరివి వినయ కుమార్,ఘంటా అంజిబాబు & జేష్ఠ సతీష్ బాబు లు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జరుగు సంస్థాగత నిర్మాణ కార్యక్రమం (సంగతున్ శ్రీజన్ అభియాన్) కార్యక్రమము నకు ఏఐసీసీ కాంగ్రెస్ పరిశీలకులుగా నన్ను నియమించింది అని పరిచయము చేసుకున్నారు. దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడి, అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని స్పష్టం చేసారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ లో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం నిర్ణయించిందన్నారు.కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు డిసిసి అధ్యక్షుల ఎన్నికలు జరుగు తాయని ,ఇందుకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు.డిసిసి అధ్యక్షుల ఎన్నికల ద్వారా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఆలిండియ కాంగ్రెస్‌లి పార్టీ నిర్ణయం తీసుకుందన్నారులి. ప్రతి ఒక్కరి తో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకోవటం జరిగింది.పీసీసీ పరిశీలికులు కొరివి వినయకుమార్,ఘంటా అంజిబాబు & జేష్ఠ సతీష్ బాబు కూడా ఈ కార్యక్రమం ను ఉద్దేశించి మాట్లాడారు.జిల్లా యూత్ కాంగ్రెస్స్ అధ్యక్షులు పీటర్ జోసెఫ్,జిల్లా ఎస్టిసెల్ చైర్మెన్ బి గోపాల కృష్ణ, చిలుకూరు సర్పంచ్ సురేష్ ,పిట్టల నాగేశ్వరావు. ,దోసపాటి గిరికుమార్,శీలం రామకృష్ణ,అన్నవరపు దుర్గారావు,మసనము సుధాకర్,అక్కల ప్రసాద్,రాగాల రాము,డోప్పల శ్రీనివాసరావు, గొడవర్తి వెంకటరశ్వరరావు,మంద వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### పేదోడి ఆరోగ్యానికి
# పూర్తి భద్రత కల్పిస్తున్న ప్రభుత్వం

- రూ. 3.50 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓ సి చెక్కును అందజేసిన మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

నూజివీడు నియోజకవర్గంలో నూజివీడు మండలం ముక్కోళ్ళ పాడు గ్రామానికి చెందిన వి, విజయ కుమార్ కుటుంబానికి సుమారు రూ.3.50లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ల్ ఒ సి చెక్కును మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. అపత్కాలంలో ఉన్న నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్య మంత్రి సహాయ నిధి, అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్య మంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుం దన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పేదవాడు డబ్బులు లేక వైద్యానికి దూరం కాకూడదని ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర పేద ప్రజల పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని మంత్రి తెలిపారు.గత ప్రభు త్వం వైద్యాన్ని తుంగలో తొక్కిందని ఒక్కరికి కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 1రూ.అయినా అందించలేదని అన్నారు. చెక్కులు అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు తాము తిరుపతి హాస్పటల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని గుండెకు మూడు స్టెంట్స్ వేయించుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కొంత ఆర్థిక సహాయం మంజూరు చేయమనిమంత్రిని అడుగగా మంత్రి తక్షణమే స్పందించి చెక్కును మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు గతంలో వైద్యం చేయించుకొని ఉన్న బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకోవచ్చని అన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహా యం వెంటనే అందజేసా _్తనన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తు ందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు,నిపుణులైన సిబ్బంది, అందుబాటులో ఉన్నారని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్విని యోగం చెసుకోవలన్నారు. రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# యూనిఫామెడ్ సర్వీసెస్ కు దోహదం ఎన్సిసి






**కరీంనగర్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

9 తెలంగాణ బెటాలియన్ ఎన్సిసి కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా కరీంనగర్ షీ టీం వారు ఎన్సీసీ కేడెట్ లకు యూనిఫామ్ సర్వీసెస్ లో భవిష్యత్తులో ఎలాంటి అవకాశాలు ఉన్నాయో వాటికి సంబంధించిన మెలకు వలను తెలియజేశారు. ఎన్సిసి శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న సాధారణ డ్రిల్, వెప్పండ్రిల్, ఎఫ్ సి బి సి, మ్యాప్ రీడింగ్ వంటి ఆర్మ్ ఫోర్సెస్ పాఠ్యాంశాలను క్షుణ్ణంగా నేర్చుకున్నట్లయితే భవిష్య త్తులో యూనిఫామ్డ్ సర్వీసెస్లో ఎంతో దోహదపడునని తెలియజేశారు, ఈ కార్య క్రమంలో షీ టీమ్ బృందం కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఏ కే జయంత , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వీకే కృష్ణ, సుబదార్ మేజర్ సూర్య ప్రసాద్ ,ఏ ఎన్ వో లు ,జి సి ఐ లు ఆర్మీ స్టాఫ్ పాల్గొన్నారు.



# తొలి తిరుపతిలో భక్తులు రద్దీ



**కాకినాడ, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది.సుమారు 16 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణ నిర్వహించామని, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,27,770, అన్నదాన విరాళాల ద్వారా రూ. 58,138, కేశఖండన ద్వారా రూ. 7,280, తులాభారం ద్వారా రూ. 300, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 16,845 వసూలైనట్లు తెలిపారు.మొత్తంగా రూ. 2,10,333 ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు తెలిపారు. దేవస్థానం తరఫున ఉదయం పులిహోర ప్రసాదం ఉచితంగా పంపిణీ చేయగా, సుమా రు 3,200 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించాం న్నారు.ఈ కార్యక్రమం లో పెద్దింటి పురుషోత్తమా చార్యులు, పెద్దింటి నారాయణా చార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం.సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు సహకరించడంతో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు విజయవంతంగా నిర్వహించగలిగామని కార్యనిర్వాహణాధికారి తెలిపారు.

# యార్లగడ్డ కృషితో నున్న ఇండ్లాస్ శాంతి వన్‌కు బస్సు సౌకర్యం

- 48ఐ నూతన సిటీ బస్సు సర్వీస్ ప్రారంభం
- ఘనంగా స్వాగతం పలికిన నాయకులు



**విజయవాడ, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్)**

విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ సమీపంలో ఉన్న ఇండ్లాస్ శాంతివన్ మానసిక చికిత్సలయం కు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృషితో ఆర్టీసీ బస్సు సౌకర్యం కలిగింది. నెలరోజుల క్రితం ఇండ్లాస్ శాంతి వనంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ శాంతి వన్ కు వచ్చే రోగులు వారి సహాయకులకు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విజయవాడ నుంచి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని ఇండ్లాస్ శాంతివన్ చైర్మన్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు కు విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణతోపాటు ఇతర అధికారులతో మాట్లాడి విజయవాడ సిటీ టెర్మినల్ నుంచి ఆర్టీసీ బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే కోరిక మేరకు విజయవాడ సిటీ బస్సు టెర్మినల్ నుంచి నున్న గ్రామం లోని ఇండ్లాస్ శాంతివన్ వరకు సిటీ బస్సు రూట్ నెంబర్ 48ఐ శనివారం ఉదయం నుండి ప్రారం భించారు. ఈ బస్సు సర్వీస్ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులకు అందుబా టులో ఉంటుంది. ఈ సర్వీస్ నున్న మోడల్ హౌసింగ్ కాలనీ, వికాస్ కాలేజీకి వెళ్లేవారికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ బస్సుకు నున్న కొటకట్ట సెంటర్ లో సొసైటీ చైర్మన్, టీడీపీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ పామర్తి శ్రీనివాస రావు, టీడీపీ గ్రామ కార్యదర్శి మాదు శివరామ ప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. నున్నకు ప్రత్యేకంగా బస్సు సర్వీసు ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావుకు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, అధికారులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సినీనటుడు శుభలేఖ సుధాకర్ భేటీ

### ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానం



**జర్నలిస్ట్ ఫైల్ ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 30 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రముఖ సినీనటుడు శుభలేఖ సుధాకర్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వచ్చే నెల 15న రవీంద్రభారతి ఆవరణలో దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయాల్సిందిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. రవీంద్రభారతి ఆవ ష్కరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతించినందుకు ఎస్పీ బాలు కుటుంబం తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రసిద్ధ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తెలుగు, తమిళ, కన్నడ, హిందీ తదితర భాషల్లో సుమారు 40 వేలకుపైగా పాటలు పాడి శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. అంతేకాకుండా పలు తెలుగు, తమిళ చిత్రాల్లో నటించి మెప్పించారు. సినిమాల్లోనే కాకుండా టీవీరంగంలో ఆయన పాడుతా తీయగా, పాడాలని ఉంది వంటి కార్యక్రమాలను నిర్వహించి ఎంతోమంది నూతన గాయనీగాయకులను వెలుగులోకి తెచ్చారు. ఆయన 2020 సెప్టెంబరు 25న కన్నుమూశారు.

## 3.1 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** గంజాయి చాక్లెట్లను తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను ఎస్‌టీఎఫ్‌సీ టీమ్ చాకచక్యంగా పట్టుకున్నారు. ఒరిస్సా నుంచి తెలంగాణకు తరలించి భెల్, చందానగర్ పరిసర ప్రాంతాల్లో స్థానికంగా అమ్మకాలు సాగిస్తున్న వారిపై ఎస్టీఎఫ్‌సీ టీమ్ దాడులు నిర్వహించారు.సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా ప్రాంతం నుంచి బిహెచ్‌ఈఎల్ ,చందానగర్‌కు వెళ్లే రహదారిలో ఉన్న వేణుగోపాల స్వామి దేవాలయం గేటు వద్ద ఒక వ్యక్తి గంజాయి,గంజాయి చాక్లెట్లు అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టీఎఫ్‌సీ టీమ్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో దాదాపు 3.1కేజీల గంజాయి చాక్లెట్లు, 850గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో భాగంగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న నరేంద్రకుమార్ పశెట్టిని పట్టుకున్నారు. కాగా నరేంద్రకుమార్ ఒరిస్సాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఒరిస్సా నుంచి గంజాయి చాక్లెట్లను తీసుకువచ్చి బిహెచ్‌ఈఎల్, చందానగర్ పరిసర ప్రాంతాలల్లో అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్టీఎఫ్‌సీ అధికారులు తెలిపారు. నిందితుడి నుంచి బైక్, సెల్‌ఫోన్, గంజాయి చాక్లెట్లను స్వాదీనం చేసుకుని శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



## తెలంగాణ విజన్ డాక్యుమెంట్

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో వచ్చే నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047 కసరత్తు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేలా 2047 అగ్రిచాప్టర్ నివేదిక ఉండాలన్నారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో వ్యవసాయరంగం సరిసమానంగా అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రైతు కేంద్రీకృత ప్రణాళికలు, రైతు ఆదాయం పెంపు, ఉత్పాదకతలో నాణ్యతా ప్రాముఖ్యత, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వంటి అంశాలను ప్రధానంగా చేర్చాలని సూచించారు. తెలంగాణలో వ్యవసాయ పరిశోధన, విస్తరణ కార్యకలాపాలకు అపార అవకాశాలున్నాయని, వాటిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. పంటల ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యకరణ, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక, నీటి వినియోగ సామర్థ్య పెంపు, ఆధునిక పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే రైతులు పండించే ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, విలువ జోడించే అగ్రి-ప్రాసెసింగ్ వ్యవస్థలను విస్తృతంగా అభివృద్ధి చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి విత్తనోత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గ్లోబల్ సీడ్ హబ్‌గా తీర్చిదిద్దాలని, నాణ్యమైన విత్తన ఉత్పత్తులు, సర్టిఫికేషన్ వ్యవస్థలు, ఎగుమతి ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే హార్టికల్చర్ మెగా క్లస్టర్లు ఏర్పాటు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు ప్రత్యేక ట్రేడింగ్ వింగ్‌ల ఏర్పాటు, డిజిటల్ వాటర్ ఇంటెలిజెన్స్ డేటా బేస్‌లు, బయో-ఇన్ఫర్మేటిక్స్ సెంటర్లు వంటి ఆధునిక మౌలిక సదు పాయాల అభివృద్ధిని వేగవంతం చేయాలని ఆయన వివరించారు.

## హైదరాబాద్ పోలీసు విభాగంలో సిఐటి పేరిట మరో దర్యాప్తు సంస్థ?

**హైదరాబాద్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** నగర పోలీసు విభాగంలో మరో దర్యాప్తు సంస్థ ఏర్పాటుకు సిటీ కొత్వాల్ సజ్జనార్ సన్నాహాలు చేస్తున్న ట్లు తెలిసింది. కీలక కేసులను విచారించడం తో పాటు ఇందులో దోషులుగా వున్న వారిపై వెంటనే ఛార్జిషీట్లు దాఖలు చేసి, త్వరితగతిన కోర్టుల్లో శిక్షలు పడేలా చేసేందుకు సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిఐటి)ను ఏర్పాటు చేసేందుకు సజ్జన్నార్ సంకల్పించినట్లు సమాచారం. సిటీ పోలీసు విభాగ ంలో ఇప్పటికే పోలీసు స్టేషన్లలో వుండే విచారణ విభాగాలతో పాటు సెంట్రల్ క్రైం స్టేషన్ (సిసిఎస్) సైబర్ నేరాలపై విచారించేందుకు ప్రత్యేకంగా సైబర్ విభాగం వుంది. దీంతో పాటు సిసిఎస్‌కు అనుబంధంగా గతంలో వున్న నార్కోటిక్ విభాగం పేరుమార్చి నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గా కొత్తగా ఏర్పాటు చేశారు. ముఖ్యమైన కేసుల్లో శాంతి భద్రతల పోలీసులతో పాటు సిసిఎస్, సైబర్ క్రైం పోలీసులకు సహకరించేందుకు టాస్క్ ఫోర్స్ విభాగం కూడా వుంది. అయితే టాస్క్‌ఫోర్స్ విభాగానికి నేరగాళ్ల పట్టివేత, ప్రాథమిక విచారణ వరకే అధికారం వుంది. కేసుల నమోదు అం తా శాంతి భద్రతల పోలీసులతో పాటు సిసిఎస్, సైబర్ క్రైం పోలీసులకు మాత్రమే వుంది. అయితే అనేక సంచలన కేసులు ఏళ్ల తరబడి విచారణ లో వుండడంతో ఈ పరిస్థితిని నివారించేందుకు సిఐటి ఏర్పాటు కు సజ్జన్నార్ సంకల్పించినట్లు తెలిసింది. దేశంలో ఈ తరహా వ్యవస్థ ఇదే తొలిసా రిగా చెబుతున్నారు. త్వరలోనే సిఐటి ఏర్పాటుకానుందని, దీనికి డిసిపి స్థాయి అధికారి పర్యవేక్షకుడుగా వుంటారని సమాచారం.

# నిబంధనలు పాటించని స్లీపర్‌కోచ్ బస్సులను పక్కన పెట్టండి

### రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశం

**హైదరాబాద్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ వ్యాప్తంగా అనేకచోట్ల స్లీపర్ కోచ్ బస్సులు ప్రమాదాల బారిన పడుతున్న నేపథ్యంలో ప్రైవేటు బ స్సుల్లో భద్రతపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అన్ని రాష్ట్రాలకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధం గా వున్న స్లీపర్ కోచ్ బస్సులను పక్కన పెట్టాలని అన్ని రాష్ట్రాలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి శనివారం నాడు ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో వెంటనే చర్యలు చేబట్టాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశించింది. దూర ప్రాంతాలకు వెళ్లే అనేక మంది కొన్నేళ్లుగా రాత్రి వేళల్లో నిద్రపోయేందుకు వీలుగా స్లీపర్ బస్సుల్లో ప్రయాణిస్తుండడం తెలిసిందే. అయితే వీటిలో చాలా వరకు బస్సులు నిబంధనలకు విరుద్ధంగా వుండడం, కాంట్రాక్ట్ క్యారేజి బస్సులుగా అనుమతులు పొంది స్లీపర్ కోచ్‌లుగా మారుతుం డడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నపుడు మృతుల సంఖ్య భారీగా వుంటోంది. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళుతున్న వారు రాత్రి వేళల్లో గాఢ నిద్రలో వున్న సమయంలో ప్ర మాదాలు జరుగుతున్న వేళ తప్పించుకునేందుకు వీలులేకుండా మృత్యువాత పడుతున్నారు. దేశ వ్యాప్తంగా స్లీపర్ కోచ్ బస్సులు అనేకం ప్రమాదాలకు గురై పదుల సంఖ్యలో ప్రయాణీకులు దుర్మరణం చెందారు. గత అక్టోబర్ 24వ తేదీన కర్నూలు జిల్లాలో జరి గిన ఇలాంటి ప్రమాదంలో 19 మంది మరణించడం సంచలనం రేపింది. స్లీపర్ కోచ్ బస్సుల్లో ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై నిపుణులు అనేకసార్లు నివేదికలు ఇచ్చారు. చాలా వరకు బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించక పోవడం, తనిఖీలు చేబట్టక పోవడం, అత్యవసర ద్వారాలను మూసి వేసి, వాటి దగ్గర సీట్లను ఏర్పాటు చేయడం వల్ల అగ్ని ప్రమాదం సంభవిస్తే మృతుల సంఖ్య భారీగా వుంటుందని నిపుణులు వెల్లడించిన అ ంశాలలో మొదటిది. దీంతో పాటు అగ్ని ప్రమాదాలను నియంత్రించే పరికరాలు చాలా బస్సుల్లో లేకపోవడం, ఇష్టానుసారం బస్సులను మార్పులు చేర్పులు చేస్తుండడం వంటివి అనేకం వున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్లీపర్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకుల్లో భయా ందోళన నెలకొంది. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలపై కొన్ని రోజులుగా రవాణా, పోలీసు విభాగాలు కఠిన చర్యలు తీసుకోసాగాయి. ఇదే విషయమై అందిన ఫిర్యాదులపై జాతీయ మానవ హక్కుల సంఘం విచారించి అన్ని రాష్ట్రాలకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

**స్లీపర్ బస్సుల్లో ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయంటే..?**

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా తిరుగుతున్న బస్సుల్లో 50 శాతం పైగా స్లీపర్ ఏసీ బస్సులే వున్నాయి. వీటి లోపలి భాగం అంతా ఇరుకుగా వుంటోం ది. అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు బస్సులో వున్న ప్రయాణీకులు బయటకు వచ్చే అవకాశం తక్కువగా వుంటోంది. ప్రతీ బస్సులో కచ్చితంగా అగ్ని ప్రమాదాలను నివారించే రక్షణ వ్యవస్థ వుండాలి. ఇప్పుడు నడుస్తున్న బస్సుల్లో మెజారిటి వాటిలో ఈ వ్యవస్థ లేదు. ఇక ముందు ఇలా వుండడానికి వీల్లేదు. స్లీపర్ కోచ్ బస్సులు నడిపే ట్రావెల్స్ సంస్థలు బస్సుల కండీషన్‌పై ఇకముందు నిరంతరం తనిఖీలు చేబట్టాలి. అత్యవసర ద్వారం వున్నచోట్ల సీ ట్లను ఏర్పాటు చేయరాదు. అదనపు సీట్ల కోసం అత్యవసర ద్వారం వద్ద ఎలాంటి ఏర్పాటు చేయరాదు. ప్రమాదాలు జరిగినపుడు ఇవి ఆటంకంగా మారుతున్నాయి.

స్లీపర్ కోచ్ బస్సుల అడుగు భాగంలో సరకు రవాణాకు ఏర్పాట్లు వుంటాయి. ఇందులో చాలా సం దర్భాలలో మండె స్వభావం కలిగిన వస్తువుల తో పాటు సెల్‌ఫోన్లు వంటివి వుంటున్నాయి. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దీని ప్రభావం బస్సులోని ప్రయాణీకులపై తీవ్రంగా చూపుతు న్నాయి, కర్నూలులో ఇదే తరహాలో బస్సు కింది భాగంలో సెల్‌ఫోన్లు భారీగా వుండడంతో మంటలకు అవన్నీ పేలిపోయి బస్సును మంటలు ఆవ హించాయి. కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది మరణించడానికి ఇది ఒక కారణంగా తేలింది.కాగా ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశాలను రాష్ట్రాలు ఏ మేరకు పాటిస్తాయనేది చూడాల్సి వుంది.

# టెట్‌కు 70,851 మంది ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల దరఖాస్తులు

### శనివారం సాయంత్రం వరకు 2,26,956 దరఖాస్తులు

### డిసెంబరు 1 వరకు ఎడిట్ సౌకర్యం

**హైదరాబాద్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కి సంబంధించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకి సైతం టెట్ తప్పనిసరి చేస్తూ సుప్రీం కోర్టు సెప్టెంబర్ 1న తీర్పు ఇచ్చిన నేపథ్యంలో టెట్-2026కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయల నుంచి 70,851 దరఖాస్తులు వచ్చినట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్-2026 ఛైర్‌పర్సన్ నవీన్ నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారంతో టెట్ దరఖాస్తు గడువు ముగిసింది. శనివారం రాత్రి 12 గంటల లోపు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. శనివారం సాయంత్రం 6 గంటల వరకు 2,26,956 దరఖాస్తులు వచ్చినట్టు డైరక్టర్ తెలిపారు. అందులో పేపర్-1కి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 26,788 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 55,133 దరఖాస్తులు కలిపి మొత్తం పేపర్-1కి 81,921 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2కి సంబంధించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల నుంచి 44,063 దరఖాస్తులు రాగా.. ఇతరుల నుంచి 1,00,972 దరఖా స్తులతో కలిపి మొత్తంగా పేపర్-2కి 1,45,035 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-1, 2కి కలిపి 2,26,956 దరఖాస్తులు వచ్చాయి. టెట్-2026కి దరఖాస్తు చేసుకున్న వారు తమ దరఖాస్తుల్లో తప్పులు ఉంటే ఎడిట్ చేసుకోవడానికి డిసెంబర్ 1 వరకు ఎడిట్ సౌకర్యానికి అవకాశం కల్పించారు. టెట్-2026 నోటిఫికేషన్ వెలువడిన మొదటి రోజు(నవంబర్14) నుంచే దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. టెట్- 2026 పరీక్షలను జనవరి 3 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. టెట్-2026 ఫలితాలను ఫిబ్రవరి 10 నుంచి 16 మధ్యలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలతోపాటు ఇతర ఏవైనా సందేహాలు, సమస్యల నివారణ కోసం అభ్యర్థులు 7093708883/ 7093708884/ 7093958881 / 7093468882/ 7032901383/ 9000756178 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

# 4 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ లోహ శాస్త్రవేత్తల సమావేశాలు

### ఐఐఎం అధ్యక్షుడు, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బిఎస్ మూర్తి వెల్లడి

**హైదరాబాదర్ (నాంపల్లి), నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్) :** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట ల్స్ (మెటలర్జీ మెటీరియల్స్ ఇంజనీరింగ్) ఐఐఎం, హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ ఐఐటి, హైదరాబాద్, విశాఖపట్నం, పలోంచ, నాగపూర్‌లలోని ఐఐఎం చాప్టర్లు, మెటీరియల్స్ సైన్స్, మెటలర్జికల్ ఇంజి నీరింగ్ విభాంగం ఐఐటి హైదరాబాద్ సహ కారంతో ఐఐటి హైదరాబాద్ వేదికగా అంత ర్జాతీయ లోహ శాస్త్రవేత్తల సమావేశం నిర్వహిస్తు న్నట్లు ఐఐఎం అధ్యక్షుడు, ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ఆచార్య బి.ఎస్.మూర్తి తెలిపారు. ఈమేరకు శనివారం ఈ కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్‌ను సంస్థ ఉపాధ్యక్షుడు డా. ఎస్.వి.ఎస్.నారాయణమూర్తి, డా. సంజయ్ కుమార్ ఝా, వి.విజయకుమార్ తదితర నిర్వాహక సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబరు 4నుండి 6వ తేదీవరకు మూడురోజులపాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ 79వ సాంకేతిక సమావేశం (ఐఐఎం ఎటిఎం-2025), శక్తి పరివర్తన కోసం అధునాతన పదార్థాలు, క్లిష్టమైన ఖనిజాలపై అంతర్జాతీయ సమావేశం జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంధానంగా, దేశం పూర్తి స్వాలంబన దిశగా మన పరిశోధనలు ముందుకు సాగేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని మిధాని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సంస్థ ఉపాధ్యక్షుడు డా.



అంతర్జాతీయ లోహ శాస్త్రవేత్తల సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, సంజయ్‌కుమార్, విజయకుమార్, బి.ఎస్.మూర్తి తదితరులు

సమావేశంలో దేశవిదేశాల నుండి 1400 మంది ప్రతినిధులు హాజరవ్వనున్నట్లు తెలిపారు. ఈ సాంకేతిక సమావేశంలో లోహశాస్త్రంలోని వివిధ విభాగాల గురించి కూలం కశంగా చర్చిస్తారని, ఆధునాతన లోహాలు, క్లిష్టమైన ఖనిజాల గురించి పరిశోధనారంగం ప్రముఖులు, శాస్త్ర వేత్తలు, విద్యాసంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ పిలుపు ఆత్మనిర్భర్ భారత్‌కు అను నారాయణమూర్తి వివరించారు. ఐఐఎం హైదరా బాద్ చాప్టర్ ఛైర్మన్ సంజయ్‌కుమార్ ఝా హైదరాబాద్ నగరంలో లోహశాస్త్ర పరిశ్రమలకు, పరిశోధన సంస్థలకు పుట్టినిల్లుగా అభివర్ణించారు. ఈ మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశంలో లోహశాస్త్ర రంగంలో విశేషమైన కృషిచేసిన శాస్త్రవేత్తలకు ప్రతిష్టాకరమైన పురస్కారాలను అందజేస్తామని కన్వీనర్ ఆచార్య భానుశంకరరావు తెలిపారు.

# బిసి స్టడీ సర్కిళ్ల ద్వారా ఐఇఎల్‌టిఎస్‌కు ఉచిత శిక్షణ

### డిసెంబరు 1 నుంచి 21 వరకు దరఖాస్తుకు అవకాశం

### స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్,నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ బిసి స్టడీ సర్కిల్స్‌లో ఐఎల్‌టిఎస్‌కి ఉచిత శిక్షణా తరగతులను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్స్‌లోనూ ఉచిత శిక్షణా తరగ తులను అందించనున్నట్టు తెలంగాణ బీసీ ఎంప్లా యిబిలిటీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెయినింగ్ సెంటర్ డైరక్టర్ డి శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య నభ్యసించే వారికి అంతర్జాతీయ స్కాలర్‌షిప్‌లు పొందేలా బిసి స్టడీ సర్కిల్‌లో శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు విదేశాలలోని అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసిం చేందుకు గల అవకాశాలను, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇవ్వబడుతున్న అంతర్జాతీయ స్కాలర్‌షిప్స్ పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ వారు ప్రారంభించడం జరుగుతుందని డైరెక్టర్ పకటనలో తెలిపారు. అందులో భాగంగా రాష్ట్రంలోని 12 బీసీ స్టడీ సర్కిల్స్ నందు విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్య క్రమాలను, ఐఈఎల్‌టిఎస్ శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగు తుందని వెల్లడించారు. ఐఈఎల్‌టిఎస్ శిక్షణ తరగతులకు హాజరు కావడానికి ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు డిసెంబర్ 1 నుంచి 21 వరకు టిజిబిసిస్టడీ సర్కిల్ వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం 040-24071178 ఫోన్‌నంబర్‌లో సంప్రదించి తెలుసుకోవచ్చని బీసీ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో స్పష్టం చేశారు.

## 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలు కోసం

# యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి

### ధర్నాలో పలువురు వక్తల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్),నవంబరు30(జర్నలిస్ట్ ఫైల్) :** 42శాతం బీసీ రిజర్వేషన్ల హామీ అమ లుకై తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జస్టిస్ చంద్రకుమార్, బీసీ జేఏసీ నేతలు జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జకృష్ణలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సర్పంచ్ ఎన్నికలు ఆపి 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తమ స్వవర్గ ప్రయోజనాల పరిరక్షణకై రెండు సంవత్సరాలుగా రిజర్వేషన్లపై ఊరించి, నేడు కేంద్రం మీదకు, కోర్టుల మీదకు తోసి బీసీ వ్యతిరేక వైఖరిని ప్రదర్శి స్తున్నారని విమర్శించారు. ఇండియా కూటమికి బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావే శాలలో లేవనెత్తే వారని, బీహార్ ఎన్నికలపై ఉన్న ఆసక్తి బీసీ రిజర్వేషన్లపై వారికి లేదని, అందుకే పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వే షన్ల ఊసే ఎత్తలేదని ఆరోపించారు. రాజ్యాంగ సవరణతోనే బీసీ రిజర్వేషన్లు అమలవుతాయని, దీనికై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లి పార్లమెంటులో బిల్లు పెట్టేందుకు కేంద్రంపై వత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు తెలంగాణ ఉద్యమ తరహాలో కులాలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాస్ యాదవ్, హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు పర్వత సతీష్‌కుమార్, సీనియర్ నేత ఏ.సంతోష్‌గౌడ్, బి.వై.శ్రీకాంత్, వేముల రామకృష్ణ, సర్దార్ పుట్టం పురుషోత్తం, నాగుల నగేష్, పద్మారావు, సత్య నారాయణ పటేల్, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న బిసి నేతలు



మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక సంఘాల నేతలు

## 4 లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దు

### మంత్రి వివేక్‌కు కార్మిక సంఘాల నేతల విజ్ఞప్తి

**హైదరాబాద్ (సైఫాబాద్),నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** రా ష్ట్రంలో కార్మిక వ్యతి రేక 4 లేబర్ కోడ్‌లను అమలు చేయరాదని కోరుతూ పలు కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రిని కార్మిక సంఘాల నేతలు నాగన్నగౌడ్, ఎం.డి. యూసఫ్, రెబ్బా రామారావు, పాలడుగు భాస్కర్, జె.వెంకటేశ్, కె.సూర్యం, అనురాధ, భరత్ తదితరులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 29 చట్టాల స్థానంలో 4 కార్మిక వ్యతిరేక కోడ్‌లను తీసుకువచ్చి ఈ నెల 21వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని ప్రకటించిందన్నారు. ఈ కోడ్‌లను కేంద్రం 2019, 2020 సంవత్సరాల్లోనే తెచ్చినప్పటికి దేశంలో కార్మికులు నిర్వ హిస్తున్న పోరాటాలకు భయపడి అమలుచేయకుండా ఆపడం జరిగింద న్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాష్ట్రంలో ఈ 4 కోడ్‌లను అమలు చేయ రాదని మంత్రిని వారు కోరారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డితో, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి తగు నిర్ణయిం తీసు కుంటామని వారికి హామీ ఇచ్చారు.

## ట్రేడింగ్ ఫ్రాడ్ వ్యవహారం.. ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్టు

**హైదరాబాద్, నవంబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ వ్యాప్తంగా అనేక మందిని పెట్టుబడుల పేరిట మోస ం చేసి కోట్లాది రూపాయలను దండుకుని జ ల్సా చేస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై దేశంలోని పలు ప్రాంతాలలో 12 కేసులుండగా తెలంగాణలో రెండు కేసులున్నాయి. ముంబాయిలోని నవీ ముంబాయికి చెందిన రవి కుమార్ (38) ఓ రియల్టర్. ఇతని స్వస్థలం ఢిల్లీ. కొంతకాలంగా నవీ ముంబాయిలో వుంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. ఇతని స్నేహితుడు నవీ ముంబాయికే చెందిన శివేంద్ర అశోక్ సింగ్ (32) కూడా సైబర్ నేరాలలో ఆరితేరాడు. మొదటి నేరగాడు నేరాలలో ఘనాపాటిగా వుంటే రెండవ వాడు మ్యూల్ ఖాతాలను సమకూర్చుకోవడంలో పేరొందాడు. అ మాయకులను అత్యాశపరులను ఒక పథకం ప్రకారం ఏమా రుస్తూ వారికి మాయమాటలు చెప్పి లక్షలాది రూపాయలను దండుకోవడం వీరి ప్రత్యేక త. ఇందు కోసం పెట్టుబడుల పేరిట వంచిస్తుంటారు. డబుల్, ట్రిబుల్ లాభాలు వస్తాయని నమ్మిస్తారు. ఈ క్రమంలో బాధితుల వర్చువల్ ఖాతా లలో లాభాలు కనిపించేలా చేస్తారు. ఇందులో కొంత మొత్తం విత్ డ్రా చేసుకునే అవకాశం ఇచ్చి మరింత లాగేస్తారు. హైదరాబాద్‌లో 53 ఏళ్ల ఓ వ్యక్తిని వీరిద్దరు ఇదే విధంగా బోల్తా కొట్టించి గత ఆగస్టు నెలలో 12.30 లక్షల రూపాయలను కాజేశారు. దీనిపై బాధితుడి నుంచి అందిన ఫిర్యా దుపై రంగంలో దిగిన సైబర్ క్రైం పోలీసులు ఇద్దరు నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరి వద్ద నుంచి నాలుగు ఫోన్లు, మూడు చెక్ బుక్కులను జప్తు చేశారు. ఈ తరహా మోసాలపై అందరు జాగ్రత్తగా వుండాలని సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు కోరారు.

## మరో రూ.6 వేల కోట్లకు బాండ్ల వేలం

**హైదరాబాద్, నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం మరో 6 వేల కోట్ల రూపాయల మేర రుణాన్ని సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రభుత్వం సెక్యూరిటీ బాండ్లను వేలానికి పెట్టింది. ఈ నెల 25నే 5 వేల కోట్ల రూపాయలను బాండ్ల విక్రయం ద్వారా సేకరించిగా, తాజాగా మరో 6 వేల కోట్ల రూపాయలకు ఇండెంట్ పెట్టింది. గతంలో అధిక వడ్డీలకు తీసున్న రుణాలకు సంబంధించి కిస్తీలను చెల్లించడం భారం గా తయారయిన నేపథ్యంలో వాటిని తీర్చడానికి తక్కువవడ్డీలకు మళ్లీ రు ణాలను తీసుకోవాల్సి వస్తోందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు.

### బిసి కమిషన్ సిఫార్సుల ప్రకారం

## స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేయాలి

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్),నవంబరు 30(జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్‌ల అమలులో అక్రమాలు, అవకతవకలు జరిగాయని బిసి కమిషన్ చేసిన సిఫార్సుల ప్రకారం ఎన్నికలను వాయిదా వేయాలని, జిఒ నం. 9 ప్రకా రం రిజర్వేషన్‌లు 42 శాతం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది బిసి నాయకులు, విద్యార్థులు శనివారం బషీర్‌బాగ్‌లో పెద్దఎత్తున బిసిల తిరుగుబాటు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన రాష్ట్ర బిసి జాక్ కమిటీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ చౌరస్తా నుంచి ప్రారంభమై బాబూజగ్జీవన్‌రామ్ విగ్ర హం వరకు కొనసాగింది. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సాక్షాత్తు రాష్ట్ర బిసి కమిషన్ తప్పు పట్టినప్పటికీ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుకు వెళ్లడం నియం తృత్వ పోకడ, ఫ్యూడల్ భావజాలానికి నిదర్శనమని ఆరోపించారు. అలా కాకుండా మొండి వైఖరితో ఎన్నికలు నిర్వహించాలని చూస్తే తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ ర్యాగ రుషి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజలకు మేలు చేయాల్సిందిపోయి రహస్య ఏజెండాలతో కీడుచేసే పనులు చేపడుతున్నదని ఆరోపించారు.




దిత్వా తుఫాను ప్రభావంతో శనివారం శ్రీలంకలోని పలు ప్రాంతాలు జలదిగ్బంధానికి గురైన దృశ్యం

# మా కమాండర్ హత్యకు ప్రతీకారం తప్పదు..

## ఇజ్రాయెల్‌కు హెజ్‌బొల్లా చీఫ్ హెచ్చరిక



**బీరూట్, నవంబరు 30 :** తమ దళ కమాండర్‌ను చంపినందుకు ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునే హక్కు తమకు ఉందని హెజ్బొల్లా గ్రూప్ అధినేత నయీమ్ ఖాసెమ్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో మరో యుద్ధం వచ్చే అవకాశం ఉందని ఆయన నొక్కిచెప్పారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే భయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఖాసెమ్ టెలివిజన్‌లో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆయుధ కేంద్రాలను వదిలిపెట్టాలనే ఇజ్రాయెల్ డిమాండ్‌ను హెజ్బొల్లా ఇప్పటికే చాలాసార్లు తిరస్కరించింది. ఈనెల 23న బీరుట్ శివారుల్లో జరిగిన దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్ హైదర్ అలీ తబ్తాబాయ్ మరణించారు. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం తర్వాత హమాస్‌కు మద్దతుగా హెజ్బొల్లా, యెమెన్‌లోని హౌతీలు దాడులు చేసిన విషయం తెలిసిందే. నయీమ్ ఖాసెమ్ మాట్లాడుతూ తమ ప్రతీకార చర్యల సమయాన్ని తామే నిర్ణయిస్తామని చెప్పారు. ఇజ్రాయెల్ విస్తృత వైమానిక దాడులు చేస్తామనే బెదిరింపులకు తాము లొంగబోమనన్న ఆయన కొత్త యుద్ధం వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 'యుద్ధాన్ని మీరు ఆశిస్తున్నారా అయితే అది ఎప్పుడైనా సాధ్యమే. అవును, ఈ అవకాశం ఉంది, యుద్ధం రాకపోయే అవకాశం కూడా ఉందని ఖాసెమ్ అన్నారు. ఘర్షణలపై తమ వైఖరి గురించి ఖాసెమ్ స్పష్టంగా చెప్పనప్పటికీ లెబనాన్ తన సైన్యం, ప్రజలపై ఆధారపడి ఇజ్రాయెల్‌ను ఎదుర్కోవడానికి ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోప్ లియో రాబోయే లెబనాన్ పర్యటన శాంతిని తీసుకురావడంలో, ఇజ్రాయెల్ దురాక్రమణను ముగించడంలో సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అటు, హెజ్బొల్లా సహా దేశంలోని ఇతర మిలిటెంట్ గ్రూపులను త్వరగా నిరాయుధులను చేయాలని లెబనాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో దేశ దక్షిణ ప్రాంతంలో హెజ్బొల్లా ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి లెబనాన్ సైన్యం చేస్తున్న ప్రయత్నాలు సరిపోవని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి అవిచాయ్ అడ్రీ వ్యాఖ్యానించారు. ఖాసెమ్ ప్రసంగం ముగిసిన కాసేపటికే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'హెజ్బొల్లా మోసం చేస్తూ, తమ ఆయుధాలను రహస్యంగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తోంది' అని అడ్రీ ఎక్స్‌లో ఆరోపించారు. అయితే, ఇజ్రాయెల్ తన దాడులు, ఆక్రమణలను కొనసాగిస్తున్నంత కాలం ఆయుధాలను వదులుకోవడానికి తాము సిద్ధంగా లేమని హెజ్బొల్లా స్పష్టం చేసింది.

## 62వ యేట ఆస్ట్రేలియా ప్రధాని వివాహం..



**కాన్‌బెర్రా, నవంబరు 30 :** ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ తన ప్రేయసి జోడీ హేడెన్‌ను వివాహం చేసుకున్నారు. 62 ఏళ్ల అల్బనీస్, ఆర్థిక సేవల రంగంలో పనిచేస్తున్న జోడీ హేడెన్‌తో ఒక్కటయ్యారు. ఈ పెళ్లితో ఆయన ఒక అరుదైన రికార్డును కూడా సొంతం చేసుకున్నారు. ఆదేశ చరిత్రలో అధికారంలో ఉండగా వివాహం చేసుకున్న మొట్టమొదటి ప్రధానిగా ఆయన నిలిచారు. కాన్‌బెర్రాలోని ప్రధాని అధికారిక నివాసం ది లాడ్జ్ గార్డెన్‌లో కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వివాహ వేడుక నిరాడంబరంగా జరిగింది. పెళ్లి తర్వాత, వధువు చేతిని పట్టుకుని ఉన్న ఒక వీడియోను మ్యారీడ్ అనే ఒకే ఒక్క పదంతో ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మా భవిష్యత్ జీవితాన్ని కలిసి పంచుకోవాలన్న మా ప్రేమను, నిబద్ధతను కుటుంబం, స్నేహితుల ముందు పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ జంట ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వేడుకలో అల్బనీస్ పెంపుడు కుక్క టోటో రింగ్ బేరర్‌గా వ్యవహరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2024 వాలెంటైన్స్ డే రోజున అల్బనీస్ ఆమెకు ప్రపోజ్ చేశారు. అల్బనీస్‌కు 2019లో మొదటి భార్యతో విడాకులు కాగా, వారికి నాథన్ అనే కుమారుడు ఉన్నాడు. అయిదేళ్ల క్రితం మెల్‌బోర్న్‌లో జరిగిన ఒక బిజినెస్ డిన్నర్‌లో అల్బనీస్, హేడెన్‌కు పరిచయం ఏర్పడింది. నూతన దంపతులు సోమవారం నుంచి ఐదు రోజుల పాటు ఆస్ట్రేలియాలోనే హనీమూన్‌కు వెళ్లనున్నారు.

## తండ్రితో గొడవపడి పాక్ సరిహద్దు దాటేసిన భారతీయుడు

### మూడునెలలుగా పాక్ అదుపులోనే ఉన్న పంజాబీ యువకుడు



**గువాహతి, నవంబరు 30 :** పాకిస్థాన్‌లోని పంజాబ్ పోలీసులు సరిహద్దులు దాటి వచ్చిన ఒక భారతీయుణ్ణి అదుపులోకి తీసుకున్నారు. పొరపాటున అతడు తమ దేశంలోకి ప్రవేశించాడని తెలిపారు. తండ్రితో జరిగిన వివాదం కారణంగా అతడు ఇంటి నుంచి వెళ్లిపోయి, సరిహద్దు దాటి పాకిస్థాన్‌లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన మూడు నెలల క్రితం చోటు చేసుకున్నప్పటికీ, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాక్ భూభాగంలోకి ప్రవేశించిన భారతీయుడిని అరెస్టు చేసినట్లు పాకిస్థాన్ అధికారులు ధృవీకరించారు. అసోంకు చెందిన 31 ఏళ్ల బీజే సింగ్ ఆగస్టు 16న పంజాబ్ సరిహద్దును దాటి తమ దేశంలోకి ప్రవేశించాడని అక్కడి అధికారులు వెల్లడించారు. సరిహద్దు ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో అతడిని అదుపులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. బీజే సింగ్ దాదాపు 100 రోజులుగా తమ ఆధీనంలో ఉన్నాడని వారు పేర్కొన్నారు. విచారణ సందర్భంగా అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో లాహోర్ నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసూర్ పోలీస్ స్టేషన్‌కు అతడిని అప్పగించినట్లు అధికారులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా తండ్రి బర్షన్ సింగ్‌తో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చినట్లు బాధితుడు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అతడు తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# ఇక గందరగోళం లేదు

## డికెతో 'టిఫిన్' మీటింగ్ తర్వాత సిఎం సిద్ధరామయ్య

**బెంగళూరు, నవంబరు 30 :** కర్ణాటక సిఎం కుర్చీ కోసం సమరం వేళ కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లు శనివారం బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు ఒక్కచోట కలిశారు. అనంతరం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మధ్య గతంలో ఎలాంటి బేదాభిప్రాయాలు లేవని ఇకముందు కూడా ఉండబోవని స్పష్టం చేశారు. కెసి వేణుగోపాల్ సూచనల మేరకు తాము బ్రేక్‌ఫాస్ట్ భేటీలో పాల్గొన్నామని, కానీ ఏ విషయంపైనా చర్చించలేదని తెలిపారు. నెల రోజుల ముందు నుంచి అందరిలో ఉన్న గందరగోళానికి తెర దించేందుకు ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. బిజెపి, జెడిఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని సిద్ధరామయ్య దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను తాను, డికె ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికలపై దృష్టి సారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కర్ణాటక ప్రజల మద్దతుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, వారికిచ్చిన వాగ్దానం ప్రకారం తాను సిద్ధరామయ్యతో కలిసి పనిచేస్తానని డిప్యూటీ సిఎం డికె శివకుమార్ పేర్కొన్నారు. తాము పార్టీకి విశ్వాసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామని హైకమాండ్ ఏం చెప్పినా దానిని అందరం అనుసరిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని 2028లో రానున్న కర్ణాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. నాయకత్వం విషయంలోనూ హైకమాండ్ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. సిఎం సిద్ధరామయ్యతో జరిగిన భేటీలో రాబోయే అసెంబ్లీ సమావేశం సహా పలు విషయాలపై చర్చలు జరిపినట్లు తెలిపారు. ఇంతకాలం పార్టీ పెద్దలు తనను వేచి ఉండాలని సూచించడంతో తాను ఎదురుచూస్తున్నానని ఇంకొంతకాలం కూడా వేచి ఉండటానికి సిద్ధమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌కు సిఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదేపదే ఖండిస్తున్నా ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలోనే పార్టీ హైకమాండ్ సూచనల మేరకు సిద్ధూ, డికె నేడు ఒక్కచోట సమావేశమయ్యారు.

## నేషనల్ హెరాల్డ్‌కేసులో తీర్పు వచ్చే 16కు వాయిదా

**న్యూఢిల్లీ, నవంబరు 30 :** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిందితులుగా ఉన్న నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ కోర్టు కీలక నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును (ఛార్జ్‌షీట్) విచారణకు స్వీకరించాలా వద్దా అనే అంశంపై తన నిర్ణయాన్ని వచ్చేనెల16కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే ఈరోజు తీర్పు వెలువరిస్తారని భావించినప్పటికీ, దానిని వాయిదా వేశారు. గతంలో ఈడీ సమర్పించిన అదనపు ఆధారాలు, పత్రాలను కోర్టు పరిశీలించిన నేపథ్యంలో ఈ నెల 7న తీర్పును రిజర్వ్ చేసింది. లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, నిధుల ప్రవాహం, అద్దె రసీదులను మరింత లోతుగా పరిశీలించాల్సి ఉందని కోర్టు భావిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రిక ప్రచురణకర్త అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2,000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను కేవలం రూ. 50 లక్షల నామమాత్రపు చెల్లింపుతో కాంగ్రెస్‌నేతలు అక్రమంగా చేజిక్కించుకున్నారని ఈడీ ఆరోపిస్తోంది. యంగ్ ఇండియన్ సంస్థ ద్వారా ఈ కుట్ర జరిగిందని, అందులో సోనియా, రాహుల్ గాంధీలకు మెజారిటీ వాటాలు ఉన్నాయని ఈడీ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసులో సోనియా, రాహుల్‌తో పాటు కాంగ్రెస్ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దూబే తదితరులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద నిందితులుగా చేర్చారు. అయితే, కాంగ్రెస్ నేతలు ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. 2012లో బీజేపీ నేత సుబ్రమ్మణ్యస్వామి చేసిన ఫిర్యాదుతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. డిసెంబర్ 16న కోర్టు వెలువరించబోయే నిర్ణయంతో ఈకేసులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

## ఒక డాక్టర్, మూడు పెళ్లిళ్లు: ఢిల్లీ పేలుళ్ల సూత్రధారి షాహీన్ కథ



**న్యూఢిల్లీ, నవంబరు 30 :** ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట సమీపంలో ఇటీవల జరిగిన పేలుళ్ల కేసులో ప్రధాన నిందితురాలిగా 46 యేళ్ల మహిళా డాక్టర్ షాహీన్ సయీద్ పేరు బయటకు రావడం సంచలనం సృష్టిస్తోంది. ఒక వైద్యురాలు, రెండు విఫలమైన వివాహాలు, కొత్తగా దొరికిన ప్రేమ.. చివరికి ఆమెను ఉగ్రవాదం వైపు ఎలా నడిపించాయో దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం ఢిల్లీ పేలుళ్ల కేసులో నిందితుడిగా ఉన్న మరో డాక్టర్ ముజమ్మిల్ షకీల్‌ను షాహీన్ 2023 సెప్టెంబర్‌లో వివాహం చేసుకుంది. ఈ బంధమే ఆమెను ఉగ్రవాద ప్రపంచంలోకి లాగిందని అధికారులు భావిస్తున్నారు. లక్నోలో విద్యావంతుల కుటుంబంలో పుట్టిన షాహీన్, అలహాబాద్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేసి ఫార్మకాలజీలో స్పెషలైజేషన్ చేసింది. 2003లో ఆమె నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జాఫర్ హాయత్‌ను వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే 2012లో వారు విడిపోయారు. ఆమె చాలా ప్రేమగల వ్యక్తి. తన పిల్లలన్నా, కుటుంబమన్నా ఎంతో ఇష్టం. అలాంటి వ్యక్తి ఇలాంటి పనుల్లో ఉందని నేను అస్సలు ఊహించలేను అని ఆమె మాజీ భర్త హయత్ ఇంటర్వ్యూలో తెలిపారు. విడాకుల తర్వాత ఒంటరితనానికి గురైన షాహీన్, తన ఉద్యోగాన్ని కూడా మానేశారు. ఆ తర్వాత ఘజియాబాద్‌కు చెందిన ఓ వ్యాపారిని రెండో వివాహం చేసుకున్నా అది కూడా ఎక్కువ కాలం నిలవలేదు. ఈ క్రమంలోనే హర్యానాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీలో తన జూనియర్ అయిన కశ్మీరీ డాక్టర్ ముజమ్మిల్ షకీల్ ఆమె జీవితంలోకి ప్రవేశించాడు. వీరి పరిచయం పెళ్లికి దారి తీసింది. ఈ సమయంలోనే జైషే మహ్మద్ మహిళా విభాగం జమాత్ ఉల్ మోమినాత్ సభ్యులు ఆమెను సంప్రదించి, ఉగ్రవాద భావజాలంవైపు మళ్లించినట్లు ఏజెన్సీలు గుర్తించాయి. పాకిస్థాన్‌లో మసూద్ అజార్ సోదరి సాదియా అజార్ నేతృత్వంలోని ఈ విభాగానికి ఇండియాలో షాహీన్‌ను హెడ్‌గా నియమించినట్లు ఆరోపణలున్నాయి. ఆమె ప్రమేయంపై కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. నా కుమార్తె ఇలాంటి చర్యలకు పాల్పడిందని నేను నమ్మలేకపోతున్నాను అని ఆమె తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ ఆవేదన వ్యక్తం చేసినట్లు ఐఎఎన్ఎస్ పేర్కొంది. ఈ కేసులో షాహీన్, ఆమె భర్త ముజమ్మిల్ షకీల్‌తో పాటు మరో డాక్టర్ అదీల్ అహ్మద్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్లలో 15 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జైస్వాల్ కన్నుమూత



**కాన్పూర్, నవంబరు 30 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి శ్రీప్రకాశ్ జైస్వాల్ (81) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో తుదిశ్వాస విడిచారు. నగరంలోని సివిల్ లైన్స్ ప్రాంతంలో ఉంటున్న ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా విషమించడంతో కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి, ఆ తర్వాత రీజెన్సీ ఆసుపత్రిలోని కార్డియాలజీ విభాగానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 1944 సెప్టెంబర్ 25న కాన్పూర్‌లో జన్మించిన జైస్వాల్, తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో సొంత నగరంతో విడదీయరాని బంధాన్ని కొనసాగించారు. 1989లో కాన్పూర్ మేయర్‌గా ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన ఆయన, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. కాన్పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై 1999, 2004, 2009 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గెలుపొందారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ2 ప్రభుత్వంలో కీలకమైన బొగ్గు శాఖతో పాటు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. సౌమ్యుడిగా, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిగా పేరున్న జైస్వాల్‌ను ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ ఓబీసీ నాయకుడుగా గుర్తింపు ఉంది. 2014, 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన మృతి పారిశ్రామిక ప్రాంతమైన కాన్పూర్‌లో కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయనకు మంచి పేరుంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. జైస్వాల్ భౌతికకాయాన్ని శనివారం ఉదయం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచి, మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు.



## భారత్‌తో సైనిక సహకార ఒప్పందం ఆమోదించిన రష్యా పార్లమెంట్

**మాస్కో, నవంబరు 30 :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సిద్ధమవుతున్న వేళ మాస్కో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. భారత్‌తో కుదుర్చుకున్న సైనిక సహకార ఒప్పందాన్ని రష్యా పార్లమెంట్‌లో ఆమోదించింది. పుతిన్ పర్యటనకు కొన్ని రోజుల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ రంగంలో సహకారాన్ని పెంపొందించే లక్ష్యంతో ఇరు దేశాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. మాస్కోలో జరిగిన కార్యక్రమంలో రష్యా రక్షణ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్, ఆ దేశంలో భారత రాయబారి వినయ్ కుమార్‌లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇప్పుడు దీనికి చట్టబద్ధత కల్పిస్తూ రష్యా పార్లమెంట్ ఆమోదముద్ర వేయనుంది. దీంతో ఇరు దేశాల మధ్య సైనిక బంధం మరింత బలోపేతం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు వచ్చేనెల 4, 5 తేదీల్లో పుతిన్ భారత్‌లో పర్యటించనున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా పుతిన్, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన గౌరవార్థం ప్రత్యేక విందు ఏర్పాటు చేయనున్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య మరిన్ని కీలకఒప్పందాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## లక్షలాది ప్రాణాలను కాపాడిన 'మీజిల్స్' టీకా

### ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి



**బెర్న్, నవంబరు 30 :** తట్టు (మీజిల్స్)పై పోరాటంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. వ్యాక్సిన్ విస్తృత పంపిణీలో గత 24 యేళ్లలో మీజిల్స్ మరణాల్లో 88 శాతం తగ్గుదల కనిపించిందని తాజా నివేదికలో పేర్కొంది. ఈ టీకా ద్వారా రెండున్నర దశాబ్దాల్లో 59 మిలియన్ చిన్నారుల ప్రాణాలు రక్షించినట్లయ్యిందని తెలిపింది. ప్రజారోగ్య చరిత్రలో అత్యంత విజయవంతమైన కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందని డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. మీజిల్స్ మరణాల సంఖ్య ఇటీవల భారీగా తగ్గింది. 2000లో 7,77,000 మరణాలు నమోదు కాగా, గతేడాది 95,000 మంది చిన్నారులు చనిపోయారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ కేసులు పెరుగుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. 2000లో 3.8 కోట్ల కేసులు నమోదు కాగా 2024లో 1.1 కోట్ల కేసులు నమోదయ్యాయి. కరోనాకు ముందు యేడాదిలో (2019)తో పోలిస్తే గతేడాది ఈ కేసులు 8 లక్షలు అదనంగా రికార్డయ్యాయి. తూర్పు మధ్యధరాప్రాంతంలో అత్యధికంగా 86 శాతం పెరగగా, యూరోపియన్ ప్రాంతంలో 47శాతం, ఆగ్నేయాసియాలో 42 శాతం పెరిగాయి. ఇదే సమయంలో ఆఫ్రికాదేశాల్లోకేసులు (40 శాతం), మరణాలు (50 శాతం) తగ్గడం గమనార్హం. ఇక్కడ విస్తృతంగా వ్యాక్సిన్ పంపిణీ చేయడం వల్లే పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల అనేక ప్రాంతాల్లో కేసులు పెరుగుతున్నప్పటికీ, పోషకాహారం, మెరుగైన వైద్యం అందుబాటులో ఉండడంతో మరణాల సంఖ్య తక్కువగానే ఉంటోందని ప్రపంచ ఆరోగ్యసంస్థ పేర్కొంది. 'ప్రపంచంలో వేగంగావ్యాపించే వైరస్ మీజిల్స్. ఇది సరిహద్దులను లెక్కచేయదు. ప్రతి చిన్నారికి వ్యాక్సిన్ అందిస్తే, వ్యాప్తికి అడ్డుకట్ట వేయడంతోపాటు ఎంతోమంది చిన్నారుల ప్రాణాలను కాపాడుకోవచ్చు. తద్వారా అన్ని దేశాల నుంచి ఈ వ్యాధిని తరిమికొట్టవచ్చు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డా. టెడ్రోస్ అధనోమ్‌పేర్కొన్నారు. డబ్ల్యుహెచ్ఒ నిబంధనల ప్రకారం రెండు డోసుల్లో ఈ టీకా తీసుకుంటే వైరస్ వ్యాప్తిని 95 శాతం అడ్డుకోవచ్చు.

## సంక్షిప్తంగా..

### అల్ ఫలా వర్సిటీలో రూ.18 లక్షలు స్వాధీనం



**న్యూఢిల్లీ, నవంబరు 30 :** ఢిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసుకు కేంద్రంగా మారిన అల్ ఫలా యూనివర్సిటీలో ఇటీవల అధికారులు సోదాలు చేశారు. కీలక నిందితురాలైన షాహీన్ షహీద్ ఉన్న గదిలో దాదాపు రూ.18 లక్షల నగదు దొరికినట్లు విశ్వసనీయ వర్గాలను పేర్కొంటూ పలు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఈ నగదు మొత్తాన్ని వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కార్యకలాపాల కోసం ఉపయోగించేందుకే దాచినట్లు తెలుస్తోందని ఆంగ్ల మీడియా పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎన్ఐఎ అధికారులు ఈ నిధుల మూలాల కోసం అన్వేషణ మొదలుపెట్టారు.

### 90 యేళ్ల వయసులో ఎన్నికల్లో పోటీ!



**తిరువనంతపురం, నవంబరు 30 :** కేరళలో వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ప్రధాన రాజకీయపార్టీల మధ్య తీవ్రపోటీ నెలకొంది. ఈ క్రమంలో ఓ 90యేళ్ల వృద్ధుడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగడం చర్చనీయాంశంగా మారింది. విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి అయిన నారాయణ్ నాయర్‌కు 90 యేళ్లు. ఆయన అశమన్నూర్ గ్రామ పంచాయతీ రెండో వార్డు నుంచి ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకిదిగుతున్నారు. తెల్లచొక్కా, ధోతీ ధరించిన నారాయణ్ వణుకుతున్న స్వరం తోనే ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులు కార్యకర్తలు, మద్దతు దారులతో ప్రచారాలు నిర్వహిస్తుండగా నారాయణ్ ఒంటరిగా ప్రజల నివాసాలకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఈ వయసులో ఎన్నికల్లో పోటీకి దిగడంపై ఓ విలేకరి ప్రశ్నించగా ఆయన బదులిస్తూ వయసు దేనికీ అడ్డుకాదన్నారు.

### పోలీసులపై పెట్రోలుపోసి నిప్పంటించిన నిరసనకారులు



**చండీగఢ్, నవంబరు 30 :** రోడ్‌వేస్ కార్మికుల ఆందోళనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. చేతిలోని బాటిల్స్‌లో ఉన్న పెట్రోల్ పోలీసులపై చల్లారు. ఒక పోలీస్ అధికారికి నిప్పంటించడంతో ఆయనకు కాలిన గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ నిరసనకారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో ఈ సంఘటన జరిగింది. స్థానిక కాంట్రాక్ట్ రోడ్‌వేస్ ఉద్యోగులు తమ డిమాండ్ల కోసం నిరసనకు దిగారు. కొందరు బస్సులపైకి ఎక్కి నినాదాలు చేశారు. వారి చేతుల్లో పెట్రోల్ ఉన్న బాటిల్స్ ఉన్నాయి. నిరసనకారులను అదుపులోకి తీసుకునేందుకు పోలీ సులు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వారి మధ్య ఘర్షణ జరిగింది.

### ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, నవంబరు 30 :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. వరుసగా 15వ రోజు కూడా గాలి నాణ్యత 'వెరీ పూర్' కేటగిరీలోనే నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) శనివారం ఉదయం 7 గంటలకు విడుదల చేసిన డేటా ప్రకారం, ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 338గా రికార్డయింది. ముందు రోజు నమోదయిన నమోదైన 385 ఏక్యూఐతో పోలిస్తే ఇది స్వల్పంగా మెరుగుపడినప్పటికీ, పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. నవంబర్ నెలలో దాదాపు ప్రతీరోజూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. వాతావరణ పరిస్థితులు కాలుష్య కారకాలు చెదిరిపోవడానికి అనుకూలంగా లేనందున, రానున్న వారంలో కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చని వాతావరణ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉండగా, కాగా మరోరెండురోజులు పొగమంచు ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 11 డిగ్రీల సెల్సియస్ వద్ద నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఐఎండీ తెలిపింది.

### ఇండిగో, ఎయిర్‌ఇండియాలకు సౌర రేడియేషన్ ఎఫెక్ట్

**న్యూఢిల్లీ, నవంబరు 30 :** దేశంలోని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు తీవ్ర అంతరాయం కలగనుంది. ఈ సంస్థలు వినియోగిస్తున్న ఎయిర్‌బస్ ఎ320 ఫ్యామిలీ విమానాల్లోని ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్‌లో ఒక సాంకేతిక సమస్యను గుర్తించడంతో, దానిని సరిదిద్దేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 200 నుంచి 250 విమానాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. తీవ్రమైన సౌర రేడియేషన్ కారణంగా ఎ320 విమానాల్లోని ముఖ్యమైన ఫ్లైట్ కంట్రోల్ డేటా దెబ్బతినే ప్రమాదం ఉందని విమానాల తయారీ సంస్థ ఎయిర్‌బస్ వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి సాఫ్ట్‌వేర్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అమరిక అవసరమని, దీనివల్ల విమాన సర్వీసులపై ప్రభావం పడుతుందని ఎయిర్‌బస్ ఒక ప్రకటనలో తెలిపింది.

## మీకోసం వెబ్ సైట్‌లో పి.జి.ఆర్.ఎస్ అర్జీలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మీకోసం వెబ్ సైట్ లో పి.జి.ఆర్.ఎస్ అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో నేరుగా అందించవచ్చని, అదేవిధంగా అర్జీలను మీకోసం వెబ్ సైట్ లోను సమర్పించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని అన్నారు.
ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల వివరాలను 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీల వివరాలు మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, వాటికి సంబంధించిన సమాచారం తెలుసుకొనుటకు 1100.(డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ఆహారపు అలవాట్లు మార్చుకుంటూనే షుగర్ వ్యాధి నియంత్రించడం సాధ్యం : డాక్టర్ శారద




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** షుగరు బిపి వంటి వ్యాధులు సంక్రమించాక దీర్ఘకాలం ఉంటాయని, కేవలం మందులపైన ఆధారపడకుండా, ఆహారపు అలవాట్లలో మార్పులు తెచ్చుకుని కొవ్వు శాతం తక్కువ ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, షుగర్ వ్యాధిగ్రస్తుల ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ శారద పేర్కొన్నారు
బుర్రిపాలెం రోడ్ లోని ఎస్ బిల్డింగ్ నందు ఆదివారం షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాల నుండి 280 మంది, షుగర్ వ్యాధిగ్రస్తులు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా d3 శారద సర్వీసు సొసైటీ, నిర్వాహకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ షుగరు బిపి, ఒకసారి వచ్చాక, వాటిని వదిలించుకోవడం అసాధ్యం అన్నారు. సుదీర్ఘకాలం వుండే ఈ వ్యాధులకు, కేవలం మందులపైన ఆధారపడకుండా,, ఆహారపు అలవాట్లలో మార్పులు అవసరమన్నారు. తీసుకునే ఆహారాన్ని కేలరీలో కొలుస్తారని, తీసుకునే ఆహారం ఎంత? ఖర్చు చేసేది ఎంత? అనేది లెక్కగా ఉండాలన్నారు. మితిమీరి తీసుకునే ఆహారం వల్ల, ఫ్యాట్ లెవెల్ పెరుగుతుందని, తద్వారా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. జి ఐ ఇండెక్స్ ప్రకారం, తీసుకునే ఆహారం ఎన్ని క్యాలరీలు అనే విషయం తెలుస్తుందని, ఆ విధంగా శరీరానికి సరిపడా క్యాలరీల ఆహారం తీసుకోవడం, వాకింగ్,వ్యాయామం వంటివి, పాటించడం ద్వారా షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో d3 శారద సర్వీస్ సొసైటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



○ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఆర్గనైజేషన్

**బాపట్ల, (జర్నలిస్ట్ ఫైల్ ):** రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో నివారించాలనే లక్ష్యంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ పని చేస్తుందని ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు వెజండ్ల శ్రీనివాసరావు అన్నారు. బాపట్ల – చీరాల రహదారిలో జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డును శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి రహదారులు,మున్సిపాలిటీ రోడ్డులో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నివారించడానికి తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు తమ ఆర్గనైజేషన్ సభ్యుల హృదయాలను కలచివేశాయన్నారు. ఈ ప్రమాదాలను అరికట్టేందుకు సభ్యులందరూ చర్చించి, బైపాస్ రోడ్ల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ బోర్డుల ఏర్పాటుకు సభ్యుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చీరాల బాపట్ల రహదారిలో సభ్యుడు సుబ్రహ్మణ్యం, స్నేహితుడు ఆంజనేయ కిషోర్ ఆర్థిక సహాయంతో హెచ్చరిక బోర్డును పెట్టినట్లు వివరించారు. ఒక ప్రమాదం జరిగితే ఆ ప్రభావం కేవలం ఆ వ్యక్తిపైనే కాకుండా, ఆ కుటుంబం మొత్తంపై పడుతుందని, ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబం రోడ్డున పడే దుస్థితి వస్తుంది చెప్పారు. సమాజ హితం కోరే మరికొంతమంది దాతలు ముందుకు వచ్చి ప్రమాదాల నివారణకు ఇలాంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలో సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్,సహాయ కార్యదర్శి బొగ్గవరుపు శివ, కోశాధికారి జోగి సువర్ణరాజు,కోళ్లపూడి కుమార్,సుబ్రమణ్యం, యాశం రాజా రమేష్,బీమా కోటేశ్వరరావు,నరాలశెట్టి నాగరాజు, ఏసోబు, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# స్వరలయ తెనాలి ఉత్సవ్ నిర్వాహణ తీరు అభినందనీయం : ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** కళలకు నెలవైన తెనాలి కళాకారులు సమాజ చైతన్యమే లక్ష్యంగా తమ కళా ప్రదర్శనలలో తగు ప్రాధాన్యత కల్పిస్తారని, అటువంటి కళాకారులు సాహితీ మూర్తుల వేదికగా, స్వరలయ తెనాలి ఉత్సవ్ నిర్వహించిన తీరు అభినందనీయమని పట్టభద్రులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు.
సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక వార్షికోత్సవాన్ని, స్వరలయ తెనాలి ఉత్సవ్ పేరిట, కళాక్షేత్రం వేదికగా ఏర్పాటు చేసిన రెండు రోజుల కార్యక్రమంలో, ఆదివారం ముగింపు సభలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వరలయ వ్యవస్థాపకులు, సాయి లక్కరాజ్ పర్యవేక్షణలో, తొలుత, సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదుకూరి జాన్సన్, బొల్లిముంత శివరామకృష్ణ, వేటూరి సుందర్రామ్మూర్తి రచించిన పాటలను గాయనీ, గాయకులు ఆలపించారు. ముగింపు సభలో పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తమప్రసంగాన్ని కొనసాగిస్తూ, సంగీత సాహిత్య కళా రంగాలలో, తెనాలి ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను, కళాకారుల సామాజిక చైతన్యాన్ని ప్రస్తావిస్తూ సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. లండన్ లో సీనియర్ ఎన్టీఆర్ తొ, పాల్గొన్న, లైవ్ షో నిర్వహించిన తీరును కళ్ళకు కట్టినట్టు వివరించారు. మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు వారి ప్రసంగాల్లో , స్వరలయ వేదిక ద్వారా, సాయి లక్క రాజ్ తెనాలి ఖ్యాతిని ఖండాంతరాలకు చాటారని, ఓ చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సాహితీ వేత్తలను కళాకారులను, స్మరించుకుంటూ, నేటిమేటి కళాకారులను సత్కరించడం అభినందనీయమని అన్నారు. వెండితెర బుల్లితెర నటి శివ పార్వతి మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు తో,తమ పరిచం, తెనాలి పట్టణంలో తమ బాల్య స్మృతులను గుర్తు చేసుకున్నారు. స్వరలయ సంస్థ చేస్తున్న కళా సేవలను ప్రశంసించారు. అనంతరం అతిధుల చేతుల మీదుగా సీనియర్ కళాకారులు, ఆరాధ్యుల వెంకటేశ్వరరావు, బడుగు రామ్మోహన్రావు, టీవీఎన్ మల్లేశ్వరరావు, ఎంవి రఘునాథరావు, బొల్లిముంతకృష్ణ, రేవతి శంకర్ లను సత్కరించారు. కార్యక్రమంలో కుమార్ పంప్ అధినేత కొత్తసుబ్రమణ్యం, మురళీకృష్ణ యాదవ్,కళాకారులు కళాభిమానులు సాహితీవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకర సమాజం అందరి బాధ్యత : ఎమ్మెల్యే నసీర్

○ రోగం రాకముందే జాగ్రత్తలు తీసుకోవాలి
○ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం
○ కేర్ వెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ చైతన్యం కలిగి ఉండాలని, వ్యాధికి గురి కాకముందే జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఆదివారం గుంటూరులోని పామ్ స్ప్రింగ్స్ లో కేర్ వెల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని రోగాలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సఖీ–సురక్ష కార్యక్రమం ద్వారా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు వైద్యులు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కేర్ వెల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షేక్ నాగూర్ బాషా పేదలకు వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే తమ వంతు సహకారం అందిస్తామని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పామ్ స్ప్రింగ్స్ అపార్ట్ మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ పెరవలి సుబ్బారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిర్మాణం అనంతర వ్యర్ధాలను కాంట్రాక్టర్లు తొలగించాలి : కమిషనర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించిన అనంతరం నిర్మాణ వ్యర్థాలను సంబంధిత కాంట్రాక్టర్ తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం కమిషనర్ పెదపలకలూరు, రత్నగిరి కాలని, అరండల్ పేట తదితర ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను మరియు సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యల పై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ పేద పలకలూరు, రత్నగిరి కాలనీ మరియు అరండల్ పేటలలో పర్యటించి, సదరు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సైడు కాలువలు మరియు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, పనులు జరుగు సమయంలో ఎమినిటి కార్యదర్శులు పనులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు పూర్తైన అనంతరం నిర్మాణ వ్యర్థాలను పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ తప్పని సరిగా తొలగించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. అభివృద్ధి పనులు పూర్తైన తరువాత వ్యర్థాలను అక్కడే వదిలేస్తున్నారని ప్రజల నుండి పిర్యాదులు వస్తున్నాయని, సదరు వ్యర్థాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సదరు ప్రాంతాలలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి, డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం తడి పొడి చేత్తలుగా విభజించి జరగాలన్నారు. మధ్యాహ్నం పూట తప్పనిసరిగా సైడు కాలువలను శుభ్రం చేయించాలని, సైడు కాలువలు శుభ్రం చేయుటకు ఆక్రమణలు ఏమైనా అడ్డుగా ఉంటె వాటిని తొలగించి, కాలువలను శుభ్రం చేయించాలన్నారు. ప్రజలు వ్యర్థాలను కాలువల్లో మరియు రోడ్ల పై వేయకుండా తడి పొడి వ్యర్థాలుగా విభజించి నగర పాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలియచేశారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ మారుమోగిన హిందూ సమ్మేళన కార్యక్రమం

○ ఆశ్రమ మఠాధిపతులచే అద్భుతమైన ప్రసంగాలు మారుమోగిన సభా ప్రాంగణం




**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్టు ఫైల్ ):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో హిందూ సమ్మేళన కార్యక్రమం వేలాది మంది జనాలతో జై శ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలతో మారు మోగిపోయిన హిందూ సమ్మేళన సభ ప్రాంగణం మొదటగా బ్రహ్మంగారిమఠం ఐదు రోడ్ల సెంటర్ నుండి వివిధ రకాల సాంస్కృత కార్యక్రమాలతో పోలీస్ స్టేషన్ దగ్గర గల ప్రాంగణం వరకు అత్యంత వైభవంగా జరిగాయి సభలో చిన్నారుల నృత్యాలు విచిత్రమైన వేషాధారణలు, చిన్నారుల అమూల్యమైన సందేశాలు అక్కడి ప్రజలను ఆకట్టుకున్నాయి కులాలకు అతీతంగా పార్టీలకు అతీతంగావర్గాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి ఈ మహా వేడుక ఆదివారం సాయంత్రం జరుపుకోవడం జరిగింది. మనమంతా హిందువులం కులం మన ఇంటి వరకే పరిమితం గడప దాటితే మనమంతా హిందువులం అనే భావన నిర్మాణం చేయడం ఈ హిందూ సమ్మేళనం యొక్క ముఖ్య ఉద్దేశం అంటూ శ్రీ అచలానంద ఆశ్రమాధిపతి శ్రీ విరజానంద స్వామి తెలపడం జరిగింది.
అంతేకాకుండా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు కులాలకు మతాలకు అతీతంగా శ్రీ అక్కయ్య స్వామికి ముత్తమ్మ తల్లికి జ్ఞానాన్ని ప్రసాదించారు, దూదేకుల కులస్తుడైన సిద్దయ్య స్వామిని శిష్యునిగా స్వీకరించి విద్యలను ప్రసాదించాడు, అంతేకాకుండా అచ్చమ్మ ఇంటా గోవులు కాసి మనమంతా ఒక్కటే మన మతం హిందూ మతం ప్రజలందరూ సోదర భావంతో కలిసి ఉండాలనేదే దైవ సంకల్పం అంటూ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీ ఈశ్వరి దేవి మఠాధిపతులు శ్రీ వీర శివకుమార స్వాములు వారు వేదాలు ఉపనిషత్తులు, మంత్రోచ్చారణలు, యజ్ఞాలు హోమాలు, అనాది కాలం నుండి వస్తున్న హిందూ ధర్మం ఎంతో గొప్పదని వారు ప్రజలకు వివరించారు అతి శక్తివంతమైన మంత్రం ఓంకారం అంటూ ఓంకార శబ్దాలను పలికించారు. మనమంతా భారతీయులం మన ధర్మం హిందూ ధర్మం మనమంతా కలిసికట్టుగా ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎస్ ఎస్. ప్రాంతీయ నిర్వహణ సభ్యులు యుగంధర్ జి శ్రీమతి రాష్ట్ర సేవికాసమితి మండల కార్యవాహిక బయన బోయిన రమాదేవి, ఇందు సమ్మేళన నిర్వహణ సమితి అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు ముఖ్య పాత్ర పోషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ ఈశ్వరి దేవి మఠాధిపతులు శ్రీ వీర శివకుమార్ స్వామి వారు తోట్లపల్లె శ్రీ అచలానంద ఆశ్రమం మఠాధిపతులు శ్రీ విరజానంద స్వామి హాజరయ్యారు, ఈ

## నేడు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమ నిర్వహణ

○ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** డిసెంబర్ 1వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్ (0863-2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని. గుంటూరు నగర కమిషనర్ పోలీస్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. అనంతరం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు జిఎంసి విభాగాధిపతులతో కలిసి ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ తెలిపారు.

## మహిళలు ఉన్నంతంగా ఎదగాలి



○ ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ బాబు

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్ ):** మహిళలు పురుషలతో పాటు సమానంగా ఎదగాలని ప్రముఖ పారిశ్రామికవేత్త కారుమంచి ప్రసాద్ బాబు అన్నారు. మండల కేంద్రం అయిన కాకుమాను సమగ్రాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ సర్టిఫికెట్ ల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. కాకుమాను గ్రామంలో గ్రామ సమగ్రాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా వృత్తి నైపుణ్య కోర్సులలో ప్రత్యేక శిక్షణ అందిస్తూ వారి ఎదుగుదలకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా మహిళలకు బ్యూటిషియాన్, టైలరింగ్,జూటు బ్యాగ్ ల తయారీ వంటి అనేక రకాల కోర్సులలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. కుట్టు శిక్షణ ని అందించి నారు వారికి శిక్షణ సర్టిఫికెట్ లను పంపిణి చేసినారు.
ఈ కార్యక్రమం లో భాగంగా కారుమంచి ప్రసాద్ బాబు మాట్లాడుతూ మహిళలు శిక్షణ పొందిన వాటిలో చక్కటి ప్రతిభ మెరుగుపరుచుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరు జీవితంగా లో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్బంగా కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు కారుమంచి ప్రసాద్ బాబు చేతుల మీదుగా శిక్షణ ధ్రువపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో కాకుమాను సమగ్రాభివృద్ధి కమిటీ సభ్యులు ఎం జవహర్ రాణి, ఆరి సత్యవతి, భారతి, శిక్షణ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జిజిహెచ్ సూపరిండెంట్‌ను కలిసిన ఖుద్దుస్



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జి జి హెచ్ వైద్యశాల సూపరింటెండెంట్ డా. ఎస్ ఎస్ వి రమణ నుఖుద్దుస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు,బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా వైద్యశాల నందు ప్రజలకు అందిస్తున్న సేవలు గూర్చి పలు అంశాలు చర్చించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ రమణ ఖుద్దుస్ గతంలో చేసిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అందించిన సేవలు గూర్చి అభినందించారు. ఖుద్దుస్ మాట్లాడుతూ గతంలో తమ ఫౌండేషన్ తరుపున అనేక సేవా కార్యక్రమం లు నిర్వహించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ రమణ అనునిత్యం ప్రజా సేవ చేయాలనీ పరితపిస్తుంటారని, అదే విధంగా ఇటీవల కాలంలో సిబ్బంది పనితీరు గూర్చి రాత్రి వేళలో మారు వేషం వేసుకొని హాస్పిటల్ లో అన్ని విభాగాలు తనిఖీ చేయడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. ఇటువంటి చర్యల వలన ప్రజలకు ప్రభుత్వ వైద్యశాల ల పట్ల మరింతగా మక్కువ పెరుగుగుందని, సిబ్బంది కీ కూడా బాధ్యతగా విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. రమణ నేత్రుత్వంలో వైద్యశాల నందు మెరుగైన సేవలందిస్తూ వైదుశాల కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంపోందించాలని కోరారు. ఈ సందర్బంగా సూపరింటెండెంట్ రమణ ను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మైనారిటి నాయకులు షేక్ రఫీ, డేవిడ్,గౌస్ పీరా, మౌలాలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎం.ఎం.ఎస్ గ్రాండ్ మోడల్ టెస్ట్ కు విశేష ఆదరణ




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ గ్రాండ్ మోడల్ టెస్ట్ కు 780 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరైనట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు.
ఈనెల 30వ తేదీ గుంటూరులోని ఏ.సి కళాశాల ప్రాంగణంలో మానవత కార్యదర్శి కె. సతీష్ నేతృత్వంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ గ్రాండ్ మోడల్ టెస్ట్ కు జిల్లాలోని పలు మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ మరియు ఎయిడెడ్ పాఠశాలల నుండి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరైనారు.
సంస్థ కార్యదర్శి కె. సతీష్ ప్రసంగిస్తూ ఎన్.ఎం.ఎం.ఎస్ సెప్టెంబర్ 1వ తేదీ నుండి ప్రతి ఆదివారం ఏ.సి కళాశాల నందు ప్రత్యక్ష శిక్షణా తరగతులు మరియు ప్రతిరోజు 2 గంటల పాటు ఆన్లైన్ లో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు దిగ్విజయంగా ముగింపు దశకు వచ్చిన నేపథ్యంలో నేడు గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహించడం జరిగినది. భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ కోచింగ్ మెటీరియల్ ఉచితంగా అందజేసిన వి.జి.ఎస్ పబ్లిషర్స్ అధినేత ఎస్. రామారావుకి, అసెంబ్లీ హాల్ సమకూర్చిన ఏ.సి కళాశాల యాజమాన్యానికి, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.
డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జి. ఏసురత్నం ప్రసంగిస్తూ చిన్న వయస్సులోనే విద్యార్థులను పోటీ పరీక్షలకు తీర్చి దిద్దేలా మానవత నిర్వహిస్తున్న ఎన్.ఎం.ఎం.ఎస్ ద్వారా పొందుతున్న శిక్షణ రేపు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ప్రజా ప్రయోజనార్థం మానవత లాంటి సంస్థలు చేపడుతున్న బహుముఖ కార్యక్రమాలలో ప్రజలు, ప్రభుత్వాలు భాగస్వామ్యం కాగలిగితే విస్తృత ప్రయోజనాలను అందించగలమన్నారు. బాల బాలికలు చిన్నతనం నుండే లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేస్తే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని తెలిపారు.
ఏ.సి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. మోజెస్ ప్రసంగిస్తూ మానవత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్.ఎం.ఎం.ఎస్ శిక్షణా తరగతులకు ఏ.సి కళాశాల వేదిక కావడం ఆనందదాయకమని, చదువును కొంటున్న నేటి రోజుల్లో నిబద్ధతతో ఉచితంగా ఎన్.ఎం.ఎం.ఎస్ శిక్షణా తరగతులు నిర్వహించిన మానవతకు అభినందనలు తెలియజేశారు.
మానవత చైర్మన్ పావులూరి రమేష్ ప్రసంగిస్తూ గత ఏడాది తాము నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులలో దాదాపు 80 మంది ఎన్.ఎం.ఎం.ఎస్ స్కాలర్షిప్ కు ఎంపికైనట్లు, ఈ ఏడాది శిక్షణా తరగతులకు హాజరవుతున్న 500 మందికి పైబడిన విద్యార్థుల్లో కనీసం 150-200 మంది ఎన్.ఎం.ఎం.ఎస్ కి ఎంపిక కాగలరని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.
కార్యక్రమ ప్రారంభంలో క్యాడిస్టర్ సాఫ్ట్వేర్ కంపెనీ వ్యవస్థాపకులు బండి శ్రీహరి ఎన్.ఎం.ఎం.ఎస్ మోడల్ పేపర్ ను ఆవిష్కరించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు కోట శ్రీనివాస్, టీవీ సాయిరాం, వి. బాలకృష్ణ చౌదరి, చావా లక్ష్మీ సామ్రాజ్యం, పావులూరి చిన్న సుబ్బారావు, కె. అరుణాచలం, అధ్యాపక సిబ్బంది జి. ప్రకాష్, బి. మంగా రావు, ఆదినారాయణ, రెహమాన్, జగదీష్, లక్ష్మి, శ్రీనివాస రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## దిత్వా తుఫాను ప్రభావం నేపథ్యంలో గుంటూరు జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తం



- కంట్రోల్ రూములు ఏర్పాటు
- 24 గంటల పర్యవేక్షణ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** దిత్వా తుపాను ప్రభావం దృష్ట్యా జిల్లా స్థాయిలో అత్యవసర చర్యలను చేపట్టామని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడం, సహాయక చర్యలను వేగంగా అందించడం కోసం జిల్లా నుంచి ప్రతి పోలీస్ సబ్‌డివిజన్ స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**పోలీస్ సబ్‌డివిజన్‌ల వారీగా కంట్రోల్ రూమ్ నంబర్లు**

ఈస్ట్ సబ్‌డివిజన్ – 0863-2223353
వెస్ట్ సబ్‌డివిజన్ – 0863-2241152/0863-2259301
నార్త్ సబ్‌డివిజన్ – 08645-237099
సౌత్ సబ్‌డివిజన్ – 0863-2320136
తెనాలి సబ్‌డివిజన్ – 08644-225829
తుళ్లూరు సబ్‌డివిజన్ – 08645-243265
జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 0863-2230100

తుఫాను సమయంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా, ప్రమాదకర వంతెనలు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ వివరించారు. ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అత్యవసర స్పందన బృందాలను మోహరించినట్లు తెలిపారు.

**సమగ్ర సమన్వయ చర్యలు**

తుఫాను ప్రభావిత గ్రామాలు, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ చెప్పారు. ప్రతి కంట్రోల్ రూమ్‌కు నోడల్ అధికారులను నియమించి, వారి పర్యవేక్షణలో సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉంటున్నారని వెల్లడించారు.

**ప్రజలకు సూచనలు**

అత్యవసరమైతే తప్ప గృహాల నుంచి బయటకు రాకూడదు. అత్యవసర పరిస్థితుల్లో సంబంధింత కంట్రోల్ రూమ్ నంబర్‌కు వెంటనే సంప్రదించాలి. ప్రజల ప్రాణ–ఆస్తి భద్రత కోసం గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరం పర్యవేక్షణలో ఉంటారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## ఆరోగ్యం,సంతృప్తితో పదవీ విరమణ చేయాలి



- పదవీవిరమణ నాటికి ఆరోగ్యం,ప్రశాంతత కలిగి ఉండటం అదృష్టం

**లక్ష్మీపురం(జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు తమ పదవీ విరమణ నాటికి ఆరోగ్యం,మానసిక ప్రశాంతత కలిగి ఉండేలా జీవనశైలిని రూపొందించుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. లక్ష్మీపురం లో జరిగిన చల్లపల్లి మండల పరిషత్ ఉద్యోగి పోతుమూడి వెంకటేశ్వరరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగి పదవీ విరమణ నాటికి ఆనందం,ఆరోగ్యం,మానసిక సంతృప్తిని కలిగి ఉండటం ఒక వరం లాంటిది అన్నారు. ఉద్యోగ విధుల్లో ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందిస్తే మానసిక ఆనందం,తృప్తి కలుగుతుతాయన్నారు. ఉద్యోగ విధులతో పాటు ఆరోగ్యం,ఫిట్నెస్ లను కాపాడుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,మండల పరిషత్ కార్యాలయాల్లో అనేక సంవత్సరాలు విధులు నిర్వహించిన వెంకటేశ్వరరావు తన పదవీకాలంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు,అతని భార్య కనక దుర్గలను సురేష్ బాబు పూలమాల దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దాల వెంకటేశ్వరరావు మండల పరిషత్తు,వివిధ పంచాయతీలకు చెందిన ఉద్యోగులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కురుమలు శాసించే స్థాయికి ఎదగాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** కరుమలు ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, దీని కోసం ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కురుమ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ లో నిర్వహించారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తోపాటు మంత్రి సవితమ్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయం నుంచి పొన్నూరు రోడ్డులోని ఎస్ కన్వెన్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ గుంటూరులో ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఏ సామాజిక వర్గంలోనైనా విద్యను ఆయుధంగా మలుచుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు. కురుమ సామాజిక వర్గాన్ని అన్న నందమూరి తారక రామారావు ప్రోత్సహించారని గుర్తు చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు కురుమలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. కురుమ నూతన కమిటీ నాయకులపై పెద్ద బాధ్యత ఉందని, సంఘంలో ఎవరికి ఎలాంటి అవసరం వచ్చినా సమష్టిగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం తరపున చేతివృత్తులు, వ్యాపారాలు రుణాలు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**బీసీలకు అండగా నిలుస్తాం: గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

బీసీ అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు అందించే ప్రోత్సహకాలను అందిపుచ్చుకోవాలని, తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లాలో కురుమ సామాజిక వర్గానికి ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ బీసీ కోసం నిరంతరం పని చేస్తున్నారని తెలిపారు. బీసీల సమస్యలపై ఆమె దృష్టికి తీసుకెళ్లిని వెంటనే పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ, సెక్రటరీ బక్కా రామకృష్ణ, కోశాధికారి కే సత్యనారాయణ, సభ్యులు ఎల్ ఆంజనేయులు, సూర్య శ్రీనివాసరావు, బీరం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్య సాధనకోసం విద్యార్థినిలు ఇష్టంగా పోటీతత్వం పెంచుకోవాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటీ రాజేంద్రప్రసాద్





**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** విద్యా అధ్యయనం ప్రతి దశలో కొత్తదనాన్ని ఆహ్వానిస్తూ, పోటీ తత్వాన్ని పెంపొందించుకుంటూ, మీకు మీరే పోటీ అనే భావనతో, ఉన్నత లక్ష్యాల సాధనకు, ఇష్టంగా సాధన చేసే క్రమంలొ పడి లేచే కెరటంలా ఉత్సాహంగా ఉండాలని ఎన్నారై విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, పట్టభద్రులఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ జూనియర్ ఇంటర్ విద్యార్థుల, యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో పేర్కొన్నారు.

ఆదివారం స్థానిక గంగానమ్మపేటలోని ఎన్నారై జూనియర్ ఇంటర్ విద్యార్థులు యూత్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఎన్ఆర్ఐ శ్రీ విఘ్నేశ్వర భవన్ యూత్ ఫెస్ట్ కార్యక్రమం,విశిష్ట యూత్ ఫెస్ట్ పేరిట, గంగానమ్మపేటలోని మమత నాగేశ్వరావు ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టుభద్రుల ఎమ్మెల్సీ, ఎన్నారై విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్, విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నిన్నటి చరిత్రలోని మంచిని గ్రహించి, రేపటి విజయం కోసం, నేడు ఇష్టంగా సాధన చేయాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు చేరువవుతాయని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు,దుశ్శాలువలుకప్పి మెమొంటోలు అందజేశారు. విద్యాసంస్థల సీఈఓ ఉమామహేశ్వరరావు, వివిధ విభాగాల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేటలోని ఎన్ వి ఆర్ కన్వెన్షన్ హాల్లో ఎన్నారై విద్యాసంస్థలకు చెందిన, వెంకటేశ్వర ,వెంకటాద్రి క్యాంపస్ లకు చెందిన, ఇంటర్ విద్యార్థుల యూత్ ఫెస్ట్, కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ అతిధిగా పాల్గొని తమ సుదీర్ఘ ఉపన్యాసంలొ 2026 విద్యాసంవత్సరంలొ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థినుల, భవిష్యత్తు విద్యా, వికాసం కోసం, దిశానిర్దేశం చేశారు. గడచిన కాలపు విద్య చరిత్ర ను, వర్తమానంలొ చేసే ఇషసాననతొ, భవిష్యత్ విద్యా వికాసం ఉన్నతులను చేస్తుందన్నారు. లక్ష్యసాధనకు నిరంతర శ్రమ అవసరమన్నారు. ఎన్నారై విద్యా వికాసం అంచలంచెలుగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు విస్తరిస్తుందని,ఇందుకు సీఈఓ ఉమామహేశ్వరరావు నిర్ణయాత్మక ఆలోచనలు, సహకరిస్తున్న అధ్యాపక వర్గం, ఆదరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు ముఖ్య కారణం అన్నారు.

ఎన్నారై విద్యాసంస్థల సి ఇఒ , సిహెచ్. ఉమామహేశ్వర మాట్లాడుతూ 2008లో ఎన్ఆర్ఐ అకాడమీని, సంస్థ చైర్మన్ ఆలపాటి రవీంద్ర గుంటూరులొ ప్రారంభించారని, 2024 విద్యాసంవత్సరం పూర్తయ్యే నాటికి, 5,539 మంది విద్యార్థులతో, 600 మంది అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందితో, రాష్ట్రంలో పలు బ్రాంచ్ లను ఏర్పాటు చేసిన తీరును వివరించారు.

వి ఎస్ ఆర్, ఎన్ వి ఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ సీఈఓ ఉమామహేశ్వరరావు నిర్విరామకృష్ణ కృషి, ఎన్నారై విద్యాసంస్థల ఉన్నతికి దోహదపడుతుందని, విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో, తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎన్ఆర్ఐ వెంకటేశ్వర వెంకటాద్రి క్యాంపస్ ల,ప్రిన్సిపాల్ ఎస్ శివన్నారాయణ, డీన్ వాసిరెడ్డి కిషోర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లాజర్, తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇప్పుడు బీసీలు గుర్తుకొచ్చారా...? : జగన్ పై మంత్రి సవిత ఫైర్

- ఆ 5 ఏళ్లూ బీసీలపై అక్రమ కేసులు, వేధింపులు
- కేసుల్లో ఇరుకున్నప్పుడు బీసీ కార్డు ప్రయోగం
- రప్పా...రప్పా...అంటూ ప్రజలను రెచ్చగొడుతున్న వైసీపీ శ్రేణులు
- రాబోయే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కష్టమే...
- టీడీపీతోనే కురబలకు మేలు : మంత్రి సవిత
- ఘనంగా గుంటూరు జిల్లా కురుబ సామాజిక నూతన కమిటీ ప్రమాణస్వీకారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అధికారంలో ఉన్న అయిదేళ్లు ఆయనకు బలహీన వర్గాలు గుర్తుకు రాలేదని, అవినీతి, అక్రమాల్లో పార్టీ నాయకులు కూరుకుపోయినప్పుడు బీసీలు గుర్తుకొస్తున్నారని జగన్ రెడ్డిపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. అయిదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలను తప్పుడు కేసులు బనాయించి, జైల్లో బధించిన విషయం మరిచిపోయారా...? అని ప్రశ్నించారు. తమది బీసీల ప్రభుత్వమని, వెనుకబడిన తరగతులను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యమని స్పష్టంచేశారు. కోర్టుకెళ్లినా, పెళ్లికెళ్లినా...ఇలా ఎక్కడికెళ్లినా రప్పా...రప్పా...అంటూ ఫ్లెక్సీలతో ప్రజలను రెచ్చగొడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న 11 సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తప్పు చేసిన వారెంతటి వారైనా చట్టం తన పని తాను చేసుకుపోతుందని వైసీపీ నేత జోగి రమేష్ అరెస్టునుద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. గుంటూరు నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్ లో గుంటూరు జిల్లా కురుబ సామాజిక జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తమది బీసీల ప్రభుత్వమని స్పష్టంచేశారు. జగన్ రెడ్డి తన అయిదేళ్ల పాలనలో బీసీలను అన్ని విధాలా వేధించారన్నారు. అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఎందరో బీసీలను హత్యలు చేశారన్నారు. కల్తీ మద్యం ఘటనలో వైసీపీ నేత జోగి రమేష్ అరెస్టయ్యేసరికి జగన్ కు బీసీలు గుర్తుకొస్తున్నారన్నారు. బీసీ కార్డుతో అవినీతి, అక్రమాలకు పాల్పగిన వారికి కాపాడుకోవాలని జగన్ కుట్ర పన్నుతున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. పెళ్లికి వెళ్లినా... కోర్టులకు వెళ్లినా... రప్పా..రప్పా అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ప్రజలను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇప్పుడున్న 11 సీట్లు కూడా రావని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**టీడీపీతోనే కురుబలకు మేలు**

అంతకుముందు నగరంలోని జిన్నా టవర్ నుంచి శ్రీ స్వేర్ ఫంక్షన్ హాల్ వరకూ జరిగిన ర్యాలీలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఓపెన్ టాప్ జీప్ లో అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మార్గమధ్యంలో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సవిత పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా ఫంక్షన్ హాలుకు చేరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ, టీడీపీతోనే బీసీలకు అన్ని విధాల మేలు జరుగుతోందని స్పష్టంచేశారు. టీడీపీని స్థాపించిన తొలి నాళల్లో అన్న ఎన్టీఆర్ కురుబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. తన తండ్రి, మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డిని రాజకీయంగా ఎంతో ప్రోత్సాహమందించారన్నారు. అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు రాజకీయ ప్రోద్బలంతో తన తండ్రి 14 శాఖలకు మంత్రిగా పనిచేశారన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కురుబలు తమ బిడ్డలతో ఉన్నత చదువులు చదించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవితను భారీ గజమాలతో కురుబ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. గుంటూరు జిల్లా కురుబ సామాజిక నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ, ఇతర సభ్యులను మంత్రి సవిత అభినందించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన విమలమ్మ బృందం ఆలపించిన గీతాలు ఆహూతులను ఉర్రూతులూంగించాయి. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గుంటూరు-1 ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవంద్రప్ప, కురుబ సామాజిక వర్గ ప్రతినిధులు తట్టి అర్జునరావు, సూర్యనారాయణ మాస్టారు, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, పి.లక్ష్మి, బి .యాదగిరి, దన్నే అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టి.వి. ఫణి పేర్రాజు

- అధ్యక్షుడిగా ఆరోసారి బాధ్యతలు చేపట్టిన ఫణి పేర్రాజు




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర మహాజన సభ ఆదివారం విజయవాడలోని రెవెన్యూ భవన్లో జరిగింది. ఈ సభలో టి.వి. ఫణి పేర్రాజు వరుసగా ఆరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా, జి. సురేష్ నాయుడు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సహకార శాఖ ఉద్యోగుల సంఘానికి చెందిన అన్ని జిల్లాల ప్రతినిధులు నలుపు ప్యాంటు-తెలుపు చొక్కా అనే ఏకరీతి దుస్తులతో హాజరై సమావేశానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఉదయం సూర్యాపేట సహకార భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుల నామినేషన్లు స్వీకరించిన అనంతరం ప్రతినిధులు విజయవాడ మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫణి పేర్రాజు మాట్లాడుతూ అసోసియేషన్ గత 56 ఏళ్లుగా క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తోందని, నవంబర్‌లో 25 జిల్లాల ఎన్నికలను పూర్తిచేసి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటుచేశామని తెలిపారు. ఉద్యోగుల మద్దతుతో వరుసగా ఆరవసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్నానని, మరింత సమర్థంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

ఫణి పేర్రాజు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉద్యోగుల బకాయిల చెల్లింపు, సేవా సమస్యల పరిష్కారంపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యోగులంతా ఏకరీతి దుస్తుల్లో సభకు హాజరయ్యారని వివరించారు. సహకార శాఖ మంత్రి మరియు కమిషనర్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పదోన్నతులు, బదిలీలు, పాస్ సంఘాల కంప్యూటరైజేషన్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షుడు ఫణి పేర్రాజు, ప్రధాన కార్యదర్శి సురేష్ నాయుడు లను అభినందించారు. కోఆపరేటివ్ అసోసియేషన్ దశాబ్దాలుగా సమిష్టిగా, ఏకమాటంగా పనిచేసే సంస్థగా ఉన్నదని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఉద్యోగుల బకాయిలు, 12వ పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి వంటి అంశాలను ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఇటీవలి కాలంలో ఒక డీఏ విడుదల, పోలీసు సరెండర్ లీవ్, ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులు వంటి నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుందని గుర్తుచేశారు.

ప్రధాన కార్యదర్శి సురేష్ నాయుడు మాట్లాడుతూ ఒకే నెలలో జిల్లా-రాష్ట్ర స్థాయిలో ఎన్నికలు సజావుగా పూర్తికావడానికి సహకరించిన ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. శిక్షణా తరగతులు, ఉద్యోగుల ప్రయాణ ఖర్చుల రీయింబర్స్‌మెంట్, టీఏ బిల్లులు వంటి ప్రధాన సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సభలో అధ్యక్షుడు టి.వి. ఫణి పేర్రాజుతో పాటు ప్రధాన కార్యదర్శి జి. సురేష్‌నాయుడు, కోశాధికారి జి.సి.బి.వి. కోటేశ్వరరావు, సహాధ్యక్షుడు పి. నాగ రమణయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. రవిశంకర్, ఉపాధ్యక్షులు, జోనల్ కార్యదర్శులు, కార్యదర్శులు, క్యాడర్ కార్యదర్శులు తదితర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నుకోబడ్డారు.

## బీజేపీ కిసాన్ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తుల్లిమిల్లి నియామకం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ కిసాన్ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి తుల్లిమిల్లి శ్రీనివాసరావును నియమించారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రైతుల కోసం నిరంతరం పనిచేస్తున్నారని, పంట, గిట్టుబాటు ధర వంటి పలు అంశాల్లో రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు. ఇటువంటి పథకాలను ప్రతి రైతు వరకు తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేసే బాధ్యత కిసాన్ మోర్చా నేతలదని ఆయన సూచించారు.

నూతన జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో కిసాన్ మోర్చాను బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన రైతు సంక్షేమ పథకాలను ప్రతి రైతు వరకు చేరవేయడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

తన నియామకానికి అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ, రాష్ట్ర సంఘటనా మంత్రి నూకల మధుకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉద్యోగుల బకాయిలపై పే స్లిప్‌లోనే స్పష్టత ఇవ్వాలి

- కేబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ పయ్యావుల కేశవ్‌తో ఏపీ జేఏసీ అమరావతి భేటీ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి అని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధి బృందం కేబినెట్ సబ్‌కమిటీ చైర్మన్ మరియు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను సచివాలయంలో కలిసి పలు ముఖ్య అంశాలను వివరించింది. జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు సమావేశాన్ని నడిపించారు.

**పే స్లిప్‌ల్లో బకాయిల వివరాలు తప్పనిసరి చేయాలి**

ఉద్యోగులకు రావలసిన వేల కోట్ల బకాయిల్లో పారదర్శకత లేకపోవడంపై జేఏసీ ఆందోళన వ్యక్తంచేసింది. డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్, ఎర్న్డ్ లీవ్, మెడికల్ రీయింబర్స్మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి బకాయిల్లో ఏ ఉద్యోగికి ఎంత రావాలో పే స్లిప్‌లో స్పష్టత ఇవ్వాలని కోరింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మెకానిజం వెంటనే తయారు చేయాలని డిమాండ్ చేసింది.

**పెండింగ్ బిల్లులు - ప్రాధాన్యత క్రమం పాటించాలి**

చనిపోయిన ఉద్యోగుల బెనిఫిట్లు, రిటైర్మెంట్ బిల్లులు, అత్యవసర వైద్య ఖర్చులు, మెడికల్ రీయింబర్స్మెంట్ వంటి అత్యవసర అవసరాల బిల్లులను ముందుగా క్లియర్ చేసేలా ఆర్థిక శాఖ చర్యలు తీసుకోవాలి అని జేఏసీ పట్టుపట్టింది. వీటి చెల్లింపులు ఆలస్యమవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొంది.

**పోలీసు ఉద్యోగుల సరెండర్ లీవ్ వెంటనే చెల్లించాలి**

సమీప సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం, పోలీసు సిబ్బంది సరెండర్ లీవ్ బిల్లులను ఈ రోజు లేదా రేపటిలోనే చెల్లించాలని జేఏసీ కోరింది. 24 గంటలపాటు, బందోబస్త్ డ్యూటీలలో పనిచేసే పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

**మహిళా ఉద్యోగినుల చైల్డ్ కేర్ లీవ్ ఆదేశాలు వెంటనే జారీ చేయాలి :** పదవీ విరమణ వరకు ఎప్పుడైనా మహిళా ఉద్యోగినులు చైల్డ్ కేర్ లీవ్ వాడుకునేలా సీఎం ఇచ్చిన హామీ అమలులోకి రావాలని కోరింది. ఆ విషయంలో స్పష్టమైన ఆదేశాలు వేగంగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

**అన్ని అంశాలపై చర్యలు - ఆర్థిక మంత్రి హామీ:** జేఏసీ ప్రతిపాదనలను ఓపిగ్గా విన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కొన్ని అంశాలపై చట్టపరమైన ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించే మార్గాలు చూస్తామని, ముఖ్యమంత్రి హామీల అమలుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఫణి పేర్రాజు, జనకుల శ్రీనివాసరావు, తమ్మిసర్తి నాగేశ్వరరావు, ఎస్. మల్లేశ్వరరావు, పారె లక్ష్మీ, పి. విజయలక్ష్మీ, రామిశెట్టి వెంకట రాజేష్, డాక్టర్ రమేష్, అ-ప్పారావు తదితర ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467